@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ... మన వార్త
AP EDITION
విజయవాడ
ప్రతి అక్షరం... ప్రజల కోసం
శనివారం 29 ఆగస్టు 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-



తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో
వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జ్‌లు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

# పచ్చదనాన్ని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం



- గ్రీన్ బోర్డ్ ఛైర్మన్ నాగబాబు
- మంగళగిరిలోని అటవీ శాఖ కార్యాలయంలో గ్రీన్ బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాగబాబు
- ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన నాగబాబు దంపతులు
- రాష్ట్రంలో 29 శాతం గ్రీనరీ ఉంది, దానిని 2047 నాటికి 50 శాతానికి పెంచేందుకు కృషి చేస్తా

**అమరావతి**

రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని గ్రీన్ బోర్డ్ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చెప్పారు. మంగళగిరిలోని అటవీ శాఖ కార్యాలయంలో గ్రీన్ బోర్డు ఛైర్మన్‌గా నాగబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో 29 శాతం గ్రీనరీ ఉందని, దానిని 2047 నాటికి 50 శాతానికి పెంచేందుకు కృషి చేస్తానన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రీన్ బోర్డ్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు - మిగతా3లో




# శాంతియుత పరిష్కారానికి ఇరుదేశాలు అంగీకారం

- భారత్–చైనా సరిహద్దు వివాదం
- సరిహద్దు ఒప్పందంపై భారత్–చైనా చర్చలు
- త్వరలోనే సానుకూల ఫలితాలు– భారతవిదేశాంగ శాఖ వెల్లడి
- సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో వీలైనంత త్వరగా మంచి ఫలితాలు సాధించాలని ఇరుదేశాలు నిర్ణయించాయి

## డబ్బుతో గెలవాలని చూసేవారికి

# ఓటమి తప్పదు

- టీడీపీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని కార్యకర్తలే తిప్పికొట్టాలని పిలుపు
- రాష్ట్రంలో గత ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం
- పదవులు తీసుకుని పనిచేయని వారిని తప్పిస్తామని హెచ్చరిక



**అమరావతి**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమై వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. అనంతరం యూనిట్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు సాగుతోందంటే కార్యకర్తల బలమే కారణమని చంద్రబాబు ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారే ఎన్నికల్లో గెలుస్తారని, డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదని హితవు పలికారు. - మిగతా3లో



# నేపాల్‌లో 579 మంది మృతి

- కిలో మీటర్ల దూరం కొట్టుకువచ్చిన మృతదేహాలు
- 1924 మంది గల్లంతు
- రసువా జిల్లాలో కొన్ని అడుగుల ఎత్తున మొదలైన వరద, బురద ప్రవాహం
- దిగువకు ప్రవహించి పలు జిల్లాల్లో బీభత్సం
- పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి
- వాహనాలు కాగితపు పడవల్లా కొట్టుకుపోయాయి
- టిబెట్‌లోనూ వరద భారీ విధ్వంసం సృష్టించింది. భవనాలకు భవనాలే నేలమట్టమయ్యాయి.

# చైనాలో భూకంపం



- రిక్టర్‌స్కేల్‌పై 5.1 తీవ్రతతో నమోదు
- నేపాల్‌లో మరో హెచ్చరిక జారీ
- చైనాలోని సిచూవాన్ ప్రావిన్స్‌లో భూకంపం
- భూమికి 13 కి.మీ. లోతులో ప్రకంపనలు
- వరద ప్రవాహం పెరిగే అవకాశం
- రెస్క్యూ టీమ్‌ను వెనక్కి రప్పిస్తున్న అధికారులు

## వైఎస్ఆర్‌సీపీ నేతల

# మాస్టర్ ప్లాన్లు

## సహాయక చర్యలకు అత్యంత ప్రాధాన్యత

- నెల జీతం విరాళంగా ఇచ్చిన నేపాల్ మంత్రులు
- నేపాల్‌లో వరద సహాయక చర్యలపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సమీక్ష
- నేపాల్ వరదల బాధితులను ఆదుకునేందుకు ప్రధాని, మంత్రుల కీలక నిర్ణయం



- తమ వారసులను పూర్తిస్థాయి రాజకీయల్లోకి రంగప్రవేశం చేయించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే వీరి అసలు ఎజెండా
- ఇప్పుడు బొత్స దృష్టి తర్వాతి తరంపై పడిందనే ప్రచారం గట్టిగా సాగుతోంది
- తన కుమార్తెను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దించి, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠంపై కూర్చోబెట్టాలని బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా అడుగులు

**విశాఖపట్టణం**

ఉత్తరాంధ్ర రాజకీయం ఎప్పుడూ కుల సమీకరణాలు, బలమైన కుటుంబాల ఆధిక్యత చుట్టూనే తిరుగుతుంటుంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ వంటి దిగ్గజాలు ప్రస్తుతం ఒకే రకమైన రాజకీయ ప్రాధాన్యతతో అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ ప్రతిపక్షంలో ఉన్న తరుణంలో.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని, తమ వారసులను పూర్తిస్థాయి రాజకీయల్లోకి రంగప్రవేశం చేయించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే వీరి అసలు ఎజెండాగా కనిపిస్తోందనే విశ్లేషణలు ఊపందుకున్నాయి. విజయనగరం జిల్లాలో బొత్స కుటుంబానిది దశాబ్దాల రాజకీయ ప్రస్థానం. బొత్స సత్యనారాయణ భార్య, సోదరులు ఇప్పటికే ప్రజాప్రతినిధులుగా పనిచేసిన అనుభవం ఉంది. అయితే, ఇప్పుడు బొత్స దృష్టి తర్వాతి తరంపై పడిందనే ప్రచారం గట్టిగా సాగుతోంది. తన కుమార్తెను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దించి, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠంపై కూర్చోబెట్టాలని బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. - మిగతా3లో

# 24 గంటలు తాగునీటి సరఫరా



- ఒంగోలుకు 24 గంటలపాటు తాగునీటి సరఫరా దిశగా కీలక అడుగులు
- రంగరాయుడుచెరువు వద్ద తాగునీటి ప్రాజెక్టు పనులు ప్రారంభించిన లోకేశ్
- 51,340 హౌస్ సర్వీస్ కనెక్షన్లతో ప్రతి ఇంటికీ తాగునీరు ఇచ్చేలా ప్రణాళిక
- ఒంగోలు రాజసం ఉట్టిపడేలా ఒంగోలు గిత్త విగ్రహావిష్కరణ
- ఒంగోలు మున్సిపాలిటీ 150 ఏళ్ల వేడుకల్లో మంత్రి లోకేశ్

**హైదరాబాద్**

ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నగరంతో ప్రత్యేక అనుబంధం ఉన్న 20 మంది ప్రముఖుల విగ్రహాలను మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని రంగరాయుడు చెరువులో అమృత్ 2.0 పథకం కింద తాగునీటి ప్రాజెక్టును మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఒంగోలు నగర ప్రజలకు 24 గంటలు తాగునీటిని అందించే దిశగా 424.42 కోట్ల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. ప్రాజెక్టులో భాగంగా ఒంగోలు నగరంలోని మొత్తం 35 డిస్ట్రిబ్యూషన్ జోన్లను రీ–జోనింగ్ చేసి, 605.30 - మిగతా3లో

# చైనాలో భూకంపం



చైనాలోని సిచువాన్‌లో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో పొరుగున ఉన్న నేపాల్‌కు శుక్రవారం మరో వరద హెచ్చరిక జారీ అయింది. భూకంప దాటికి చైనా, నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఆనకట్ట తెగిపోయిందని పోలీసులు భావిస్తున్నారు. అలాగే, ఎగువ నుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహం నది నీటిమట్టం పెరిగే ప్రమాదం ఉన్నందున, నేపాల్‌లోని ప్రభావిత ప్రాంతమైన త్రిశూలి ప్రాంతాన్ని మరోసారి ఖాళీ చేయిస్తున్నట్లు నేపాల్ పోలీసులు తెలిపారు. బీజింగ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం సంభవించిన ఈ భూకంపం భూమికి 13 కి.మీ. లోతులో సంభవించినట్లు తెలుస్తోంది. పైనుంచి బురదతో కూడిన నీటి ప్రవాహం వేగంగా వస్తుండటంతో, నేపాల్‌లోని త్రిశూలి పరివాహక ప్రాంతాన్ని అధికారులు తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు. రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొంటున్న సైన్యం, భద్రతా సిబ్బంది, స్థానిక ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని నేపాల్ పోలీసులు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాగా, చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లోని లాంగ్‌చాంగ్ నగరాన్ని భూకంపం కుదిపేసిందని చైనా భూకంప నెట్‌వర్క్ సెంటర్ తెలిపినట్లు నివేదించింది.

మరోవైపు, నేపాల్‌లో వరద వల్ల నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని స్థానిక పోలీసులు తెలిపారు. కాబట్టి సహాయక చర్యల్లో పాల్గొన్న వాహనాలను వెనక్కి తిరిగివస్తున్నాయని చెప్పారు. నేపాల్?కు మరో తీవ్రమైన వరద ముప్పు పొంచి ఉందని అన్నారు. పైనుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహం వల్ల నేపాల్‌లోని త్రిశూలి ప్రాంతంలో ప్రజలను మరోసారి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. అలాగే, నేపాల్– చైనా సరిహద్దు సమీపంలో భోటే కోషి నది దిగువన ఉన్న ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని నేపాల్ జలవిజ్ఞాన, వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ సరస్సులో సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, రానున్న మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు అందులోకి చేరే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఆనకట్ట తెగిపోయే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌కు తెలియజేశారు.

**ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ చర్యల్లో పాల్గొన్న భద్రతా దళాలు**

మరోవైపు, భౌగోళిక సవాళ్లు ఉన్నప్పటికీ నేపాల్ సైన్యం సహాయక చర్యలను కొనసాగిస్తోందని ప్రతిపక్ష నాయకుడు భీష్మరాజ్ పేర్కొన్నారు. త్రిశూలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "సైన్యం, హెలికాప్టర్ బృందం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి. ఈ ఆపరేషన్‌లో రెండు సైనిక హెలికాప్టర్‌లతో పాటు, ఇతర ప్రైవేటు రంగానికి చెందిన మరికొన్నింటిని రంగంలోకి దించారు. అందుబాటులో ఉన్న ప్రతి వనరునూ వినియోగించుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న ఓ అధికారి మీడియాతో మాట్లాడారు. తాము కాఠ్మండు నుంచి వచ్చామని, ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రభుత్వం, నేపాల్ ప్రభుత్వం రెండూ కలిసి శిథిలాలను తొలగించే పనిలో నిమగ్నమై ఉందని పేర్కొన్నారు.

**పెరుగుతున్న మృతుల సంఖ్య**

నేపాల్‌లోని రసువా జిల్లాలో సంభవించిన వినాశకరమైన ఆకస్మిక వరదల కారణంగా మృతుల సంఖ్య శుక్రవారం నాటికి 469కి చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సుమారు 1,545 మంది గాయపడ్డారని నేపాల్ పోలీసులు తెలిపారు. అత్యధికంగా చిత్వాన్ జిల్లాలో 178 మృతదేహాలు లభ్యమయ్యాయని, ఆ తర్వాత ఎన్‌పీ ఈస్ట్‌లో 110, గోర్ఖాలో 44, నువాకోట్‌లో 37, ధాడింగ్‌లో 33, తనాహున్‌లో 28, ఎన్‌పీ వెస్ట్‌లో 27, రసువాలో 12 మృతదేహాలు దొరికాయని చెప్పారు. వరద బురదలో చిక్కుకుపోయిన తర్వాత బయటపడిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, ఒక స్థానికుడు ఇలా అన్నారు. "మేం చాలా బురదలో చిక్కుకుపోయాము. మా ఇళ్లు, దుకాణాలు, సామాన్లను అన్నింటిని కోల్పోయాం. మేం మా పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో మొదట భూమి కదలడం గమనించాం. కానీ, అది సాధారణమేనని భావించాం. కానీ త్రిశూలి, ధోబీ వాగుల నుంచి నీరు 50 అడుగుల ఎత్తున ఉప్పొంగడం చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యాం. అందులో పడి చాలా మంది కొట్టుకుపోయారు. త్రిశూలి మార్కెట్ ప్రాంతంలో ఒక్క మనిషి కూడా మిగల్లేదు. మేము ఎలాగోలా తప్పించుకోగలిగాము" అని ఆందోళన వ్యక్తం చేశారు.

# శాంతియుత పరిష్కారానికి ఇరుదేశాలు అంగీకారం



భారత్, చైనా మధ్య జరుగుతున్న సరిహద్దు చర్చలు(ఎర్లీ హార్వెస్ట్) గురించి భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం కీలక విషయాలు వెల్లడించారు. ఈ చర్చల ద్వారా ఇరుదేశాలు సరిహద్దు వివాదాన్ని శాంతియుతంగా, ఇరుపక్షాలకు ఆమోద యోగ్యమైన, సహేతుకమైన, న్యాయమైన రీతిలో పరిష్కరించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2005లో ఏర్పరుచుకున్న మార్గదర్శకాలు, నియమ, నిబంధల ప్రకారమే, ఈ చర్చలు ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో వీలైనంత త్వరగా మంచి ఫలితాలు సాధించాలని ఇరుదేశాలు నిర్ణయించాయని రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఇందుకోసం ఔవీజజ (సరిహద్దు వ్యవహారాలపై సంప్రదింపులు, సమన్వయం కోసం ఏర్పాటు చేసిన వర్కింగ్ మెజానిజం) పరిధిలోని సరిహద్దు గుర్తింపు నిపుణుల కమిటీ తన చర్చలు మరింత వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీని ద్వారా సరిహద్దు గుర్తింపు ప్రక్రియలో వీలైనంత త్వరగా సానుకూల ఫలితాలు సాధించేలా ఇరుదేశాలు ముందడుగు వేయనున్నాయని ఆయన వెల్లడించారు.

**నేపాల్‌లోని భారత పర్యటకుల పరిస్థితి ఏంటి?**

మరోవైపు నేపాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సురక్షితంగా బయటపడిన భారత పర్యటకులను, ఆ దేశంలోని భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ త్రిభువన్ శుక్రవారం కలుసుకున్నారు. కాఠ్?మండు నుంచి ఇండిగో విమానంలో భారత్‌కు తిరుగు ప్రయాణమైన భారతీయ పౌరులకు ఆయన వీడ్కోలు పలికారు. ఈ విషయాన్ని నేపాల్?లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. నేపాల్?లోని రుసువా, ధాడింగ్, నువాకోట్? సహా ఇతర ప్రాంతాల్లో భారీ ఆకస్మిక వరదల వల్ల వందలాది మంది మరణించగా, మరెందరూ గల్లంతయ్యారు. ఇళ్లు, వంతెనలు, జలవిద్యుత్ మౌలిక సదుపాయాలు, రోడ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. అయితే వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 85 మంది భారతీయులతో సహా కనీసం 121 మంది విదేశీ పర్యటకులను భద్రతా దళాలు రక్షించినట్లు నేపాల్ టూరిజం బోర్డు శుక్రవారం తెలిపింది. నేపాల్ టూరిజం బోర్డు ఇచ్చిన సమాచారం ప్రకారం, భద్రతా దళాలు కాపాడిన పర్యటకులలో 9 మంది దక్షిణ కొరియా పౌరులు, 16 మంది చైనా పౌరులు కూడా ఉన్నారు. శుక్రవారం నాటికి ఉన్న సమాచారం ప్రకారం, నేపాల్ వరదల్లో చిక్కుకుని మరణించిన వారి సంఖ్య 538కి పెరిగింది. మరోవైపు ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో 2.391 మంది నేపాల్ ఆర్మీ సిబ్బందితో పాటు, మొత్తం 7,451 మంది భద్రతా సిబ్బందిని నేపాల్ రంగంలోకి దింపింది.

**మరోసారి ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం?**

నేపాల్?ను ఇప్పటికే ఆకస్మిక వరదలు అతలాకుతలం చేయగా, నీటి మట్టాలు పెరగడం వల్ల మరోసారి వరదలు వచ్చే ప్రమాదం ఉందని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్?డీఆర్?ఆర్?ఎంఏ) శుక్రవారం వెల్లడించింది. అందువల్ల భోటెకోశి, త్రిశూలి ప్రాంతాల్లోని ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది.

**భారత్‌లోకి కొట్టుకువస్తున్న మృతదేహాలు**

మరోవైపు నేపాల్‌ను ముంచెత్తిన వరదలు వల్ల మరణించిన వారి మృతదేహాలు ఇప్పుడు మన దేశంలోని నదుల్లోకి కొట్టుకొస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్, బిహార్‌లోని వాల్మీకి నగర్ బ్యారేజ్ వద్ద ఇప్పటివరకు 5 మృతదేహాలు లభ్యమయ్యాయి. ముఖ్యంగా యూపీలోని మహారాజ్‌గంజ్ జిల్లా పరిధిలో గండక్ నదిలో నాలుగు గుర్తుతెలియని మృతదేహాలను సశస్త్ర సీమా బల్ బలగాలు వెలికితీశాయి. అవి తీవ్రంగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయని, వాటిని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించామని అధికారులు తెలిపారు. అటు బిహార్‌లోని వాల్మీకి నగర్ బ్యారేజ్ వద్ద కూడా మరో మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహాలు నేపాల్ వరదల్లో గల్లంతైన వారివేనా లేదా అనేది నిర్ధరించేందుకు ఆ దేశ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు భారత అధికారులు వెల్లడించారు.

## సహాయక చర్యలకు అత్యంత ప్రాధాన్యత

వరదలతో అతలాకుతలమైన పొరుగుదేశం నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక, గాలింపు చర్యలపై భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుత పరిస్థితులపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సమీక్షించారు. నేపాల్‌లో సహాయక చర్యలకు భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరోవైపు నేపాల్ మంత్రులు తమ నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇవ్వాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. కాఠ్‌మాండూ, బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయాలతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నట్లు జైశంకర్ తెలిపారు. నేపాల్‌లో ఉన్న భారతీయుల క్షేమం, ప్రస్తుత పరిస్థితిపై తాజా సమాచారం సేకరించినట్లు పేర్కొన్నారు. నేపాల్‌కు మరింత సహాయ సామగ్రి పంపే అంశంపైనా విదేశాంగ శాఖలోని సంబంధిత విభాగాలతో చర్చించినట్లు జైశంకర్ తెలిపారు. ఇప్పటికే భారత్ సహాయ చర్యల్లో భాగస్వామ్యం కాగా, అవసరమైన మరిన్ని వస్తువులను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా, ఆయన మంత్రివర్గ సహచరులు కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ఒక నెల జీతాన్ని ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. రసువా జిల్లాలోని భోటే కోశీ ప్రాంతంలో వరదల వల్ల జరిగిన నష్టం, సహాయక చర్యలు, పునరావాసం, పునర్నిర్మాణంపై సమావేశంలో చర్చించారు. వరదలతో నష్టపోయిన వ్యక్తులు, వ్యాపార సంస్థలకు ప్రత్యేక సహాయ, పునరావాస ప్యాకేజీ సిద్ధం చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి ఇబ్బందులు తలెత్తకుండా నేపాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులను ప్రభుత్వాల మధ్య ఒప్పందం (+2+) విధానంలో కొనుగోలు చేసేందుకు కృషి సామగ్రి కంపెనీ లిమిటెడ్‌కు సూత్రప్రాయ అనుమతి ఇచ్చింది. వరదల కారణంగా రవాణా వ్యవస్థ దెబ్బతినడం, పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడటంతో ఎరువుల సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

**జిన్‌పింగ్ అధ్యక్షతన అత్యవసర సమీక్ష**

నేపాల్–టిబెట్? సరిహద్దు వరదలపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కూడా అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన, సహాయక, గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విపత్తులో మృతిచెందిన వారికి సంతాపంగా సమావేశంలో జీ జిన్‌పింగ్, ఇతర నేతలు కొద్దిసేపు మౌనం పాటించారు. గల్లంతైన చైనా, విదేశీ పౌరులందరినీ గుర్తించి రక్షించేందుకు శాస్త్రీయంగా గాలింపు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

**భారత్–నేపాల్ వాణిజ్యానికి వరద దెబ్బ**

వరదల ప్రభావం భారత్–నేపాల్ సరిహద్దు వాణిజ్యంపైనా పడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా సోనౌలి సరిహద్దు వద్ద నేపాల్‌లోకి వెళ్లాల్సిన సరకు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. భారత వైపు సుమారు 16 కిలోమీటర్ల మేర ట్రక్కుల క్యూ ఏర్పడింది. కాఠ్?మాండూ సహా నేపాల్‌లోని వివిధ ప్రాంతాలకు సరుకులు తీసుకెళ్లే వాహనాలు రహదారులు దెబ్బతినడంతో ముందుకు కదలలేకపోతున్నాయి. రాకపోకలు ఆలస్యమైతే ఇరు దేశాల మధ్య సరకు సరఫరాపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు.

## నేపాల్‌లో 579 మంది మృతి..



**నేపాల్** : నేపాల్ వరదల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను రెస్క్యూ బృందాలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు 579 మృతదేహాలు వెలికితీసినట్లు నేపాల్ పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఈ విపత్తులో ఇప్పటివరకు 1473 మంది గాయాలపాలైనట్లు పేర్కొన్నారు.

**320 మంది భారతీయులు గల్లంతు..**

మరోవైపు, నేపాల్‌లో 320 మంది భారతీయుల ఆచూకీ ఇంకా తెలియలేదని భారత విదేశాంగశాఖ వెల్లడించింది. చైనా వైపు 400 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని, వారిలో 96 మంది రోడ్డు మార్గంలో సురక్షితంగా నేపాల్‌లోకి ప్రవేశించారని పేర్కొంది. మరో 21 మంది కాఠ్‌మాండూ నుంచి దిల్లీకి చేరుకున్నారని తెలిపింది.

**కిలో మీటర్ల దూరం కొట్టుకువచ్చిన మృతదేహాలు..**

నదీ పరివాహక ప్రాంతంలో మృతదేహాలను వెలికితీసే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో యూపీలోని మహారాజ్‌గంజ్ జిల్లాలో నాలుగు, కుషీనగర్ జిల్లాలో మూడు మృతదేహాలు లభ్యమయ్యాయని అధికారులు వెల్లడించారు. ఇవి నేపాల్ నుంచి కొట్టుకువచ్చినట్లు భావిస్తున్నామని మహారాజ్‌గంజ్ జిల్లా మెజిస్ట్రేట్ గౌరవ్ సింగ్ సోగార్వాల్ తెలిపారు. ఈ మృతదేహాలు ఎవరివనే విషయం ఇంకా నిర్ధరణ కాలేదని, ఇదే విషయంపై నేపాల్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు.

**చైనా వైపు 558 మంది..**

టిబెట్‌లోని చైనా–నేపాల్ సరిహద్దులో ఉన్న గీరోంగ్ కౌంటీలో సంభవించిన ఆకస్మిక వరదల్లో 558 మంది గల్లంతైనట్లు చైనా వెల్లడించింది. ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. గల్లంతైన వారిలో 260 మంది విదేశీయులే ఉన్నారని పేర్కొన్నప్పటికీ వారి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇదిలా ఉంటే, టిబెట్ వైపున ఉన్న ఒక సరస్సు కట్టలు తెంచుకొని ప్రవహిస్తోందని నేపాల్ వెల్లడించింది. వరద ప్రభావిత ప్రాంతంలో సహాయక చర్యలు చేపడుతోన్న బృందాలు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరించింది.

## 1.77 అంగుళాలు వంగిన భాక్రా నంగల్ డ్యామ్ గోడ - క్లారిటీ ఇచ్చిన కేంద్రం



పంజాబ్‌లోని భాక్రా నంగల్ డ్యామ్ గోడ 1.77 అంగుళాలు వంగిందని సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది. ఒకవేళ డ్యామ్ తెగిపోతే దిల్లీ సహా పలు నగరాలు మునిగిపోతాయనే భయాలు ఈ వీడియో వల్ల రేకెత్తాయి. అయితే ఈ విషయంపై ప్రభుత్వ అధికారిక నిజ నిర్ధరణ విభాగమైన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) కీలక ప్రకటన చేసింది. ఈ వాదనను పూర్తిగా తప్పుదోవ పట్టించేదిగా, అవాస్తవమైనదిగా పేర్కొంది. 2026 ఆగస్టు 27న భాక్రా నంగల్ డ్యామ్ గోడలో నమోదైన అసలు కదలిక కేవలం 0.86 అంగుళాలు మాత్రమేనని పీఐబీ స్పష్టం చేసింది. ఇది ఇంజినీరింగ్ భద్రతా ప్రమాణాల ప్రకారం నిర్దేశించిన సాధారణ పరిధిలోనే ఉందని వెల్లడించింది.

**వదంతులను, తప్పుడు వార్తలను నమ్మొద్దు!**

మరోవైపు, భాక్రా నంగల్ డ్యామ్ నిర్మాణాత్మకంగా పటిష్టంగానే ఉందని అధికారులు, నిపుణులు తెలిపారు. దాని స్థిరత్వానికి ఎలాంటి ముప్పు లేదని ధ్రువీకరించారు. ఈ ఆనకట్టను ప్రపంచంలోనే అత్యంత ప్రధానమైన డ్యామ్‌ల్లో ఒకటిగా పరిగణిస్తారని వెల్లడించారు. ఒత్తిడి, రంధ్ర పీడనం, లీకేజీ వంటి కీలక నిర్మాణ భద్రతా సూచికలు నిర్దేశించిన సురక్షిత పరిమితుల్లోనే ఉన్నాయని స్పష్టం చేశారు. కాగా, భాక్రా నంగల్ డ్యామ్ భద్రతపై సోషల్ మీడియాలో ప్రచారంలో అవుతున్న వీడియోలను, భయాందోళనలు సృష్టించే వదంతులను నమ్మొద్దని పీఐబీ, పంజాబ్ ప్రభుత్వం ప్రజలను కోరాయి. భాక్రా నంగల్ ఆనకట్ట భద్రతకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక, ధ్రువీకరించిన మూలాల నుంచి వచ్చిన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేశాయి. పీఐబీ, అధికారులు ప్రకటనతో భాక్రా నంగల్ డ్యామ్ గోడ వంగిందన్న దుష్ప్రచారానికి తెరపడింది.

**కొన్నాళ్ల క్రితం మంత్రి ప్రకటన**

కొద్ది రోజుల క్రితం పంజాబ్ జలవనరుల శాఖ మంత్రి బరీందర్ కుమార్ గోయల్ కూడా రాష్ట్ర అసెంబ్లీలో భాక్రా నంగల్ డ్యామ్ గురించి ప్రసంగించారు. ఈ క్రమంలో ఆనకట్ట భద్రతపై ఉన్న ఆందోళనలను తగ్గించేందుకు ప్రయత్నించారు. భాక్రా నంగల్ డ్యామ్ గోడలో తాత్కాలిక కదలిక, దాని ఇంజినీరింగ్ డిజైన్‌లో ఒక సాధారణ భాగమని గోయల్ అన్నారు. నీటి ఒత్తిడి పెరిగినప్పుడు స్వల్ప కదలిక సంభవించవచ్చని, ఒత్తిడి తగ్గినప్పుడు నిర్మాణం తిరిగి యథాస్థితికి వస్తుందని తెలిపారు. గత 40 ఏళ్లలో భాక్రా నంగల్ డ్యామ్ గోడలో ఇలాంటి కదలికలు 15 సార్లు నమోదయ్యాయని వివరించారు. అందుకే ఈ విషయంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. భాక్రా నంగల్ ఆనకట్ట సురక్షితంగానే ఉందని చెప్పారు.

**పంజాబ్ సర్కార్‌కు హరియాణా ప్రభుత్వం విజ్ఞప్తి**

ఇటీవలే పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్‌లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హరియాణా సర్కార్ కోరింది. లేకపోతే ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని అభిప్రాయపడింది. దిల్లీలో ఆప్ అధికారంలో ఉన్నన్నాళ్లు నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవని పేర్కొంది. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదని వెల్లడించింది. అలాంటి సమయంలో దిల్లీ ప్రజలను శిక్షించేలా పంజాబ్ ప్రభుత్వం వ్యవహరించకూడదని కోరింది. అసలు హరియాణాకు రావాల్సిన వాటా జలాలే రాలేదని స్పష్టం చేసింది. భాక్రా నంగల్ ఆనకట్ట నిర్మాణం 1948వ సంవత్సరంలో మొదలై 1963లో పూర్తైంది. దీని ఎత్తు 741 అడుగులు (226 మీటర్లు). ఈ డ్యామ్ ఇంచుమించు 10 మిలియన్ ఎకరాలకు పంట నీరును అందిస్తుంది. ఈ డ్యామ్‌ను ఉత్తర భారతదేశంలోని పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ సరిహద్దులలో నిర్మించారు. ఈ డ్యామ్ నిర్మాణానికి ముఖ్య కారణం సట్లెజ్–బియాస్ నదీ పరీవాహక ప్రాంతంలో వరదలను నిరోధించడం, పంట పొలాలకు సాగునీటి పంపిణీ, జల విద్యుత్తు (హైడ్రో విద్యుత్) ను ఉత్పత్తి చేయడం. ప్రస్తుతం భాక్రా నంగల్ ప్రాజెక్టు పంజాబ్, హరియాణా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ నీటి అవసరాలను తీరుస్తోంది.

# అప్పుడు ముద్దు... ఇప్పుడు వద్దా...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు అసలు వద్దు.. ప్రతీ చోటా పోటీకి దిగి తీరాల్సిందే అంటూ ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడైనా ఏకగ్రీవాలు అయితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వనని తేల్చేశారు. ఇదే జగన్ గతంలో అధికారంలో ఉన్న సమయంలో జరిగిన స్థానిక పోరులో సరికొత్త రికార్డు స్థాయిలో ఏకగ్రీవాలు నమోదు కావడం, ఇప్పుడు దానికి భిన్నంగా ఆయన వ్యాఖ్యానించడమే దీనికి ప్రధాన కారణం.వైసీపీ పాలనా కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే ఏకగ్రీవాల హవా ఎంతలా సాగిందో అర్థమవుతుంది. ఆనాడు రాష్ట్రంలో మొత్తం 660 జెడ్పీటీసీ స్థానాలకు గాను ఏకంగా 126 స్థానాలు పోటీ లేకుండానే ఏకగ్రీవమయ్యాయి. ఇక ఎంపీటీసీల విషయానికొస్తే మొత్తం 9,696 స్థానాలకు ఎన్నికలు ప్రకటిస్తే, రికార్డు స్థాయిలో 2,371 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో 2,271కి పైగా స్థానాలను అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే సొంతం చేసుకుంది. 2021 స్థానిక పోరులో పంచాయతీల నుంచి కార్పొరేషన్ల వరకు వేల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కానీ నేడు ప్రతిపక్షంలోకి రాగానే జగన్ ఏకగ్రీవాలకు స్వస్తి పలికి ఓటింగ్ జరగాల్సిందే అని పట్టుబట్టడం రాజకీయ శైలిలోని వ్యూహాత్మక మార్పును సూచిస్తోంది.గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు నాటి అధికార పార్టీ ఏకగ్రీవాల దిశగా వేగంగా అడుగులు వేసింది. నాలుగు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 13,097 పంచాయతీలకు గాను 2,196 పంచాయతీలు, అలాగే 1,31,325 వార్డులకు గాను 47,400 కంటే ఎక్కువ వార్డు స్థానాలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఇక పట్టణ స్థానిక సంస్థల్లో చూస్తే.. 11 కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీల్లోని మొత్తం 2,711 వార్డులలో 590 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ముఖ్యంగా చిత్తూరు మున్సిపల్



కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో 37 డివిజన్లు, కడప కార్పొరేషన్ పరిధిలోనూ సింహభాగం ఏకగ్రీవాలు అయ్యాయి.ఇప్పుడు వైఎస్ జగన్ ఏకగ్రీవాలు వద్దు అని చెప్పడం వెనుక ఉన్న అసలు పొలిటికల్ ట్రిక్స్ స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీకే ఏకగ్రీవాలు చేసుకునేందుకు ఎక్కువ అనుకూల పరిస్థితులు ఉంటాయి. అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థతో పాటు స్థానిక ప్రభావం కూటమి వైపు ఉండే అవకాశం ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఏకగ్రీవాలకు మొగ్గు చూపితే ప్రత్యర్థి పార్టీలే మెజారిటీ స్థానాలను పోటీ లేకుండా కైవసం చేసుకుంటాయనే ముందస్తు అంచనా జగన్‌లో ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయి కేడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యంత ముఖ్యం. ఏకగ్రీవాలకు ఒప్పుకుంటే గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు నిరాశకు గురవుతారు. ఓటింగ్ వరకు వెళ్తేనే అధికార కూటమిని నిలదీసే అవకాశం లభించడమే కాకుండా, రాబోయే రోజుల్లో కేడర్‌లో ఉత్సాహం నింపవచ్చని జగన్ భావిస్తున్నారు. అందుకే ఏకగ్రీవాల ప్రక్రియను నిరోధించడం ద్వారా కూటమికి సులువైన విజయం దక్కకుండా అడ్డుకోవాలనేది వైసీపీ వ్యూహం.ఈ నిర్ణయంలో ఒక రాజకీయ వైరుధ్యం కూడా కనిపిస్తోంది. తమ హయాంలో ఏకగ్రీవాలు జరిగినప్పుడు వాటిని సంక్షేమ పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతు అని సమర్థించుకున్న వైసీపీ నేతలు.. ఇప్పుడు మాత్రం ఏకగ్రీవాలు జరిగితే అది అక్రమమే, బెదిరింపుల వల్లే జరుగుతోంది అనే ప్రచారం చేయడానికి సిద్ధమవ్వాల్సి వస్తోంది. ఏది ఏమైనా.. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించడం, ప్రతిపక్షంలోకి రాగానే వాటిని వ్యతిరేకించడం అనేది ఏపీ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా వస్తున్న అధికార-ప్రతిపక్షాల పాత ఫార్ములానే అని చెప్పవచ్చు.

# పాపం... మోపీదేవి...

**గుంటూరు :** మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ పరిస్థితి రెండిటికీ చెడ్డ రేవడిగా మారింది. ఇటు పార్టీ మారినా ప్రయోజనం లేదు. ఏ పదవి లేకుండానే ఏళ్లు గడచిపోతున్నాయి. రాజ్యసభ పదవిని వదులుకుని మరీ వైసీపీ నుంచి బయటకు వచ్చిన మోపిదేవి వెంకటరమణ తన రాజకీయం పతనాన్ని తానే కొనితెచ్చుకున్నట్లయింది. గత కొన్నేళ్ల నుంచి మోపిదేవి గురించి ఊసే వినిపించడం లేదు. రాజ్యసభ సభ్యుడిగా ఉండాల్సిన మోపిదేవి వెంకటరమణ రాజీనామా చేసినా ఎమ్మెల్సీలు ఖాళీ అవుతున్నా ఆయనకు అవకాశం దక్కడం లేదు. రానున్న కాలంలో పదవి దక్కుతుందన్న గ్యారంటీ కూడా ఏమీ లేదు. ఎందుకంటే టీడీపీలోనే అనేక మంది పదవుల కోసం ఆశావహులు సుదీర్ఘకాలం నుంచి ఎదురు చూస్తున్నారు. దీంతో మోపిదేవి వెంకటరమణ కు ఈ టర్మ్ లో పదవి దక్కే అవకాశం లేదన్నది వాస్తవం. అయితే ఆయన ఇటీవల కాలంలో పూర్తిగా మౌనంగా ఉంటున్నారు. వైసీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఓటమి పాలయినా జగన్ తన కేబినెట్ లో చోట కల్పించారు. ఎమ్మెల్సీని చేసి మరీ మోపిదేవి వెంకటరమణ ను మంత్రివర్గంలో స్థానం కల్పించారు. తర్వాత శాసనమండలి రద్దు ప్రతిపాదన చేయడంతో మంత్రి పదవి నుంచి తప్పించి మోపిదేవిని రాజ్యసభకు పంపారు. అయితే 2024 లో వైసీపీ ఓటమి తర్వాత ఎవరూ ఊహించని విధంగా మోపిదేవి వెంకటరమణ వైసీపీని వీడటం చర్చనీయాంశమైంది. ఇంకా పదవీ కాలం ఉన్నప్పటికీ తన పదవిని వదులుకున్న మోపిదేవి వెంకటరమణకు టీడీపీ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎలాంటి పదవి ఇవ్వలేదు. ఇక నియోజకవర్గంలోనూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉండటంతో అక్కడ మోపిదేవి సాధారణ కార్యకర్తగానే మారిపోయి ఉండాల్సి వచ్చింది. అసలు పార్టీ ఎందుకు



మారారు? ఏం సాధించారు? అన్న ప్రశ్నకు ఆయన నుంచి సమాధానం మాత్రం లేదు.ఇప్పటి వరకూ చాలా ఎమ్మెల్సీ పోస్టులు భర్తీ అయినా అందులో మోపిదేవి పేరు కనిపించలేదు. మోపిదేవి వెంకటరమణ సైకలెక్కి ఇప్పుడు బాధపడితే ప్రయోజనం ఏముంటుంది? అని ఆయన అనుచరులే ప్రశ్నిస్తున్నారు. అనేక రాజకీయ పరిణామాల నేపథ్యంలో మోపిదేవి వెంకటరమణ లాంటి సీనియర్ నేతలు పార్టీలు మారడం వల్ల రెండు వైపులా భిన్నమైన చర్చలు జరుగుతుంటాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మోపిదేవి వెంకటరమణ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన సందర్భంలో, కొందరు ఆయన నిర్ణయాన్ని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలు నిజమయ్యేలా కనిపిస్తున్నాయి. .ఈ రాజకీయ పరిణామాలు లేదా మోపిదేవి వెంకటరమణ గారి ప్రస్తుత రాజకీయ పాత్ర ఎలాంటి స్పష్టత లేదు. ప్రస్తుతం ఏ పదవి లేకుండా మోపిదేవి వెంకటరమణ విశ్రాంతి తీసుకోవడం తప్ప ఆయన చేసిందేమీ ఉండదన్న వ్యాఖ్యలు కొంత ఘాటుగానే వినిపిస్తున్నా అందులో మాత్రం నిజం ఉందంటున్నారు.

# ఫినిషింగ్ దశకు కడప స్టార్టప్ హబ్

**కడప :** రాయలసీమ ప్రాంతంలో ఐటీ, సాంకేతిక రంగాల ముఖచిత్రాన్ని మార్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కడప స్టార్టప్ హబ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకే పరిమితమైన స్టార్టప్ సంస్కృతిని రాయలసీమ యువతకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇది రూపుదిద్దుకుంది. స్థానిక నిరుద్యోగ యువత ఉన్నత చదువుల అనంతరం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే అవసరం లేకుండా, ఇక్కడే కొత్త ఆవిష్కరణలు, వ్యాపారాలు ప్రారంభించేందుకు ఇది అద్భుత వేదికగా నిలవనుంది. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో సిద్ధమైన ఈ భవనాన్ని త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు కడప జిల్లా యంత్రాంగం వేగంగా సన్నాహాలు చేస్తోంది.ఉద్యోగాల కోసం ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి.. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి" అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టికి అనుగుణంగా జిల్లా పాలనా యంత్రాంగం ఈ ప్రాజెక్టును ఆకృతి చేసింది. స్టార్టప్ కడప పేరుతో పిలిచే ఈ ప్రతిష్టాత్మక హబ్‌ను ఖ4 మోడల్‌లో రూపొందించారు. ఐఐటీలు, ఐఐఎంల నిపుణులు, గ్లోబల్ టెక్ కంపెనీల అధిపతులతో విద్యార్థులు , ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మెంటార్‌షిప్ ఇచ్చేలా దీనికి శ్రీకారం చుట్టారు.ఈ స్టార్టప్ హబ్ నిర్మాణాన్ని



కడపలో నిర్మించిన స్టార్టప్ హబ్

కడప జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో శరవేగంగా పూర్తి చేశారు. మొత్తం రూ. 12 కోట్ల అంచనా వ్యయంతో 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉ+3 ఆకృతిలో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్టు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నీతి ఆయోగ్ రూ. 3 కోట్లు మంజూరు చేయగా, ప్రముఖ మౌలిక వసతుల సంస్థ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ తమ ఆఖీ నిధుల కింద రూ. 4 కోట్లు ఆర్థిక సహాయం అందించింది. మిగిలిన నిధులను జిల్లా యంత్రాంగం సేకరించి నిర్మాణాన్ని పూర్తి చేసింది.ఈ భవనంలో ఒకేసారి 400 మందికి పైగా పనిచేసుకునేలా ప్లగ్ అండ్ ప్లే వర్కింగ్ స్పేస్ వసతిని కల్పించారు. సరికొత్త బిజినెస్ ఐడియాతో వచ్చే యువతకు హై-స్పీడ్ ఇంటర్నెట్, ప్రోటోటైపింగ్ ల్యాబ్‌లు, లీగల్, ఫైనాన్షియల్ సలహాలతో పాటు ఫండింగ్ సమకూర్చే గ్లోబల్ వెంచర్ క్యాపిటలిస్టులను కూడా ఇక్కడికి అనుసంధానించనున్నారు. కడపను ఐటీ, ఆవిష్కరణల నిలయంగా మార్చే దిశగా ఈ భవన ప్రారంభోత్సవం సరికొత్త మైలురాయిగా నిలవనుందని స్థానిక పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.జగన్ ఎప్పుడూ కడపకు ఐటీ గురించి ఆలోచించలేదు.. ఫిష్ మార్టుల గురించి మాత్రమే గొప్పగా చెప్పేవారు. అందుకే కనీసం క్రెడిట్ తీసుకునేందుకు ఒక్క శాతం కూడా చాయిస్ లేకుండా పోయింది.

## డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు

-మొదటిపేజీ తరువాయి

పార్టీకి శిక్షణ ఇవ్వడం అనేది అత్యంత కీలకమైన కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. పార్టీ విలువలు, సిద్ధాంతాలను నూతన నాయకత్వానికి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అనుభవం, పార్టీ భావజాలంపై పూర్తి అవగాహన ఉన్నవారితోనే శిక్షణ ఇప్పిస్తున్నామని, దీనివల్ల సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయని వివరించారు. నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై అధ్యయనం చేస్తూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. సొంతంగా పత్రిక, ఛానల్ పెట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్న 'గొడ్డలి పార్టీ' విధానాలను కార్యకర్తలే తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీడియాను అడ్డం పెట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను వాస్తవాలతో ప్రజలకు వివరించాలని కోరారు. గొడ్డలి పార్టీగా తాను అభివర్ణించిన పార్టీ అధ్యక్షుడి వల్లే రాష్ట్రంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారని, దేశ రాజకీయ చరిత్రలోనే ఒక నాయకుడి వల్ల ఇలా జరగడం ఇదే ప్రథమమని తీవ్రంగా విమర్శించారు.

రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి, సొంత కంపెనీలలో పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు. నేరాలు చేయించి, వాటిని అలవాటుగా మార్చి, ఆ నేరాలే మెడకు చుట్టుకుంటాయనే సమయంలో వారిని అంతం చేయడమే ఆ పార్టీ విధానమని, ఇలాంటి వారి వ్యక్తిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. గత ప్రభుత్వం మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని, 2019-24 మధ్య కాలంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని గుర్తు చేశారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ అని, పదవులు తీసుకుని పనిచేయని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## పచ్చదనాన్ని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

నాగబాబు ధన్యవాదాలు తెలిపారు. గ్రీనరీ మీద నాకు చాలా ఆసక్తి ఉంటుంది. నేను ముందు నుంచీ మొక్కలు నాటడం కోసం కార్యక్రమాలు నిర్వహించేవాడ్ని. పవన్ కల్యాణ్‌కు కూడా పర్యావరణం, పచ్చదనం అంటే ఇష్టం. మా ఇద్దరి ఆలోచనలు ఇక్కడ కలుస్తాయి. రాష్ట్రాన్ని హరితహారంగా మార్చడమే మా బాధ్యత. ఇంతకు ముందు నాకు సంతోషాన్ని ఇస్తుంది కాబట్టి మొక్కలు నాటడం, ప్రకృతి కాపాడటంలో ముందున్నాను. ఇకపై బాధ్యతగా ఈ పని చేస్తా. ఇది నాకెంతో సంతృప్తినిస్తుందని ఆశిస్తున్నాను.' సీఎం అభినందనలు: ముఖ్యమంత్రి చంద్రబాబుని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కలిశారు. నేడు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని సతీసమేతంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబును సత్కరించి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.

## 24 గంటలు తాగునీటి సరఫరా

-మొదటిపేజీ తరువాయి

కిలోమీటర్ల పొడవున తాగునీటి పంపిణీ నెట్‌వర్క్ అభివృద్ధి చేశారు. దీని ద్వారా 51,340 హౌస్ సర్వీస్ కనెక్షన్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఇంటికీ మెరుగైన తాగునీటి సరఫరా అందనుంది. నగరంలో నీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించి, ప్రజలకు నిర్ణీత సమయాల్లో మాత్రమే కాకుండా 24 గంటలూ తాగునీరు అందుబాటులో ఉండేలా చేయడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం. పెరుగుతున్న ఒంగోలు నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన, స్థిరమైన నీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

రాడిసన్ హోటల్‌కు భూమిపూజ

ప్రకాశం జిల్లా అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. సంతనూతలపాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలో 100 కోట్ల రూపాయల పెట్టుబడితో నిర్మించనున్న రాడిసన్ హోటల్‌కు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్? భూమిపూజ చేశారు. రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ సంయుక్త భాగస్వామ్యంతో నిర్మించనున్న ఈ హోటల్ ఒంగోలు పరిసర ప్రాంతాల్లో తొలి 5-స్టార్ హోటల్‌గా నిలవనుంది. 151 లగ్జరీ గదులు, రెస్టారెంట్, బార్, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్‌తో పాటు కార్పొరేట్ సమావేశాలు, వివాహాలు, సదస్సుల కోసం భారీ బ్యాంకెట్ హాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్‌హెచ్-16కు సమీపంలో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టు ద్వారా బిజినెస్, టూరిజం రంగాలకు ఊతం లభించడంతో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. కార్యక్రమం అనంతరం మంత్రి లోకేశ్? కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయంగా పలకరించి అర్జీలు స్వీకరించారు

## వైఎస్ఆర్‌సీపీ నేతల మాస్టర్ ప్లాన్లు



-మొదటిపేజీ తరువాయి

స్థానిక పోరు ద్వారా సీటు ఖాయం చేసుకుంటే.. భవిష్యత్తులో అసెంబ్లీ లేదా పార్లమెంట్ స్థానాలకు ఆమెను సులువుగా తీసుకురావచ్చనేది బొత్స ప్లాన్. పార్టీ అధికారాన్ని కోల్పోయిన సమయంలో కేడర్‌ను కాపాడుకోవడంతో పాటు, తమ సొంత వారసులకు స్థానిక సంస్థల ద్వారా అధికారిక గుర్తింపు తీసుకురావడం సీనియర్ నేతలకు రెండు రకాలుగా కలిసివచ్చే అంశం. ఇక శ్రీకాకుళం జిల్లా రాజకీయాలను శాసిస్తున్న ధర్మాన సోదరుల రూట్ కూడా ఇంచుమించు ఇదే దారిలో సాగుతోంది. ధర్మాన ప్రసాదరావు తన కుమారుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడిని, కృష్ణదాస్ తన కుమారుడు కృష్ణ చైతన్యను ఇప్పటికే నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా తిప్పుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమి తర్వాత.. కుమారులను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడానికి స్థానిక ఎన్నికల కంటే మంచి అవకాశం మరొకటి ఉండదని ధర్మాన సోదరులు భావిస్తున్నారు. జెడ్పీటీసీ లేదా కార్పొరేషన్ స్థాయి పోటీల ద్వారా వీరిని క్షేత్రస్థాయికి అలవాటు చేయాలని చూస్తున్నారు.ఈ పరిణామాల వెనుక ఉన్న అసలు పొలిటికల్ ట్విస్ట్ ఏమిటంటే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత పార్టీని నడిపించడం కంటే, తమ కుటుంబ రాజకీయ వారసత్వం చేజారిపోకుండా చూసుకోవడానికే ఈ సీనియర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారం చేతిలో లేని సమయంలో పార్టీ తరఫున గట్టిగా పోరాడే కంటే, స్థానిక ఎన్నికల రూపంలో వచ్చిన అవకాశాన్ని వాడుకుని తమ వారసులకు ప్రజాప్రతినిధి ముద్ర వేస్తే, భవిష్యత్తులో అధికార మార్పిడి జరిగినప్పుడు సులువుగా స్థిరపడవచ్చనేది వీరి ఆలోచన. ఈ వారసత్వ రాజకీయాల ఎత్తుగడలకు క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి బలంగా ఉంది. అధికారంలో ఉన్న కూటమి స్థానిక ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తుంది. ఈ పరిస్థితుల్లో సీనియర్లు తమ ప్రభావంతో వారసులను గెలిపించుకోవడం అనుకున్నంత తేలికైన విషయం కాదు. పైగా వైసీపీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకున్న కేడర్ ఈ వారసత్వ నిర్ణయాలను ఎంతవరకు ఆమోదిస్తారనేది ప్రశార్థకమే.ఉత్తరాంధ్ర వైసీపీ సీనియర్లు బొత్స, ధర్మాన సోదరులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీ ఉనికిని చాటుకునే పోరాటం మాత్రమే కాదు. తమ రాజకీయ వారసుల భవిష్యత్తును నిర్ణయించే అగ్నిపరీక్ష . తమ బలాన్ని ఉపయోగించి వారసులను స్థానిక పీఠాలపై కూర్చోబెట్టి పొలిటికల్ రీ-లాంచ్ చేస్తారా లేక అధికార కూటమి ధాటికి డిఫెన్స్‌లో పడతారా అనేది వేచి చూడాలి.

# మల్లవరం సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా.

**తల్లాడ మీ వార్త ప్రతినిధి.** 28.8.2026 మల్లవరం గ్రామ సర్పంచ్ శ్రీ కటికి. కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలను వారి స్వగృహం నందు షేక్ జమాల్ ఆధ్వర్యంలో 28.08.26 శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కటికి. కిరణ్ కుమార్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం షేక్ జమాల్ ఆధ్వర్యంలో సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ అన్నశాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ సందర్భంగా షేక్ జమాల్ మాట్లాడుతూ మల్లవరం గ్రామ అభివృద్ధికి సర్పంచ్ కటికి .కిరణ్ కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మల్లవరం గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కటికి. కిరణ్ కుమార్ అన్న ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు కలగాలని భవిష్యత్తులో మరింత ఉన్న స్థాయికి ఎదగాలని కోరుకుంటూ వారికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కిసాన్ జిల్లా అధ్యక్షులు ఎర్రి కృష్ణారావు , కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపా. మహేష్, మాజీ సర్పంచ్ గొల్లగూడెం గుండ్ల వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ దుగ్గిదేవర రవీందర్, కుప్పాల నరసింహారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.



# విద్యార్థులు సామాజిక బాధ్యత, హక్కులపై అవగాహనను పెంచుకోవాలి

ఐఐటీ హైదరాబాద్ ఆచార్యులు ప్రమోద్ కె. నాయర్

**తాడేపల్లిగూడెం ఆగస్టు 28 (మీ వార్త ప్రతినిధి)** విద్యార్థులు సామాజిక బాధ్యత, హక్కులపై అవగాహనను పెంచుకోవాలని ఐఐటీ హైదరాబాద్ ఆచార్యులు, డాక్టర్ ప్రమోద్ కె. నాయర్ సూచించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కె. హిమబిందు ఆధ్వర్యంలో సైన్స్, బాధ్యత మరియు హక్కులను పొందే హక్కు" అనే అంశంపై బీటెక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం రవీంద్ర కళాభారతిఆడిటోరియంలో సామాజిక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధి ఐఐటీ హైదరాబాద్ ఆచార్యులు ప్రమోద్ కె. నాయర్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం కేవలం విద్యా, పరిశోధనా రంగాలకే పరిమితం కాకుండా సమాజ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ సామాజిక బాధ్యతలను గుర్తించి సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని చెప్పారు. ప్రస్తుత సమాజంలో హక్కులు, బాధ్యతలపై అవగాహనను కలిగి ఉండటం ప్రతి విద్యార్థికి అవసరమని తెలిపారు. శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించే విధంగా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని వివరించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథంతో పాటు సామాజిక చైతన్యం, బాధ్యతాయుతమైన ఆలోచన విధానాన్ని పెంపొందించేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ జీబి వీరేష్ కుమార్, ఆచార్యులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ టి.రేష్మా తదితరులు పాల్గొన్నారు.




# అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ రక్షణపై పోలవరం పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

పోలవరం సీఐ బి. కృష్ణ కుమార్

ఎస్సై పి. అప్పారావు

**పోలవరం మీ వార్త ఆగస్టు 28** ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పోలవరం డీఎస్పీ కె. జయకృష్ణ సూచనలతో పోలవరం సీఐ బి. కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో పోలవరం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా పోలవరం ఎస్సై పి. అప్పారావు పోలీసు సిబ్బందికి పెరేడ్ నిర్వహించి, క్రమశిక్షణ, విధి నిర్వహణలో అప్రమత్తత, శారీరక దృఢత్వం మరియు సమన్వయంతో విధులు నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు.అనంతరం పోలవరం సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు మరియు సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన ప్రాణరక్షణ చర్యలపైశిక్షణలో ముఖ్యంగాగుండెపోటు లేదా శ్వాస ఆడక అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి సీపీఆర్,ఎలా చేయాలి.పాముకాటుకు గురైన వ్యక్తికి తక్షణం అందించాల్సిన ప్రాథమిక సహాయం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు వెంటనే ఆసుపత్రికి తరలించాల్సిన విధానం అగ్ని ప్రమాదాల్లో కాలిన గాయాలు అయినప్పుడు బాధితులకు అందించాల్సిన ప్రథమ చికిత్స రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు సురక్షితంగా సహాయం చేయడం, అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడం,నీటిలో మునిగిపోయిన వ్యక్తిని రక్షించిన అనంతరం చేపట్టాల్సిన ప్రాథమిక ప్రాణరక్షణ చర్యలువంటి అంశాలపై



సిబ్బందికి వివరంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయంలో, సరైన విధానంలో స్పందించడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని డాక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ఇటువంటి ప్రాణరక్షణ నైపుణ్యాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రమాదాలు మరియు ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించాల్సిన బాధ్యత కూడా ఉందని, అందుకే ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు పోలీసు సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది హెచ్ వీర్రాజు, మురళీ,నరేశ్, స్వామి,



సతీష్,రమేష్, కోటి, బుల్లిరాజు, షాజహాన్, గంగరాజు,నాగలక్ష్మి, సుజాత, మరియు సిబ్బంది మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించిన ట్రై కార్ చైర్మన్ బోరగం శ్రీనివాసరావు .





**జీలుగుమిల్లి.( మీ వార్త ప్రతినిధి )**మండల కేంద్రంలో నిర్మాణం లో ఉన్న అన్నా క్యాంటీన్ భవనాన్ని రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసరావు . పోలవరం నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. అన్న క్యాంటీన్ లో జరుగుతున్న నిర్మాణ పనులను వారు పరిశీలించారు.
భవన నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ఈ భవన నిర్మాణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, అత్యున్నత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
అన్నా క్యాంటీన్ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన సేవలను అందించే కేంద్రంగా మారనున్నందున, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు.
ప్రజలకు నాణ్యమైన, తక్కువ ధరకు భోజనం అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన అన్నా క్యాంటీన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అన్నారు.
. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయికృష్ణ. ఎంపీటీసీ నాలి శ్రీను. ఏఎంసి డైరెక్టర్ గద్దె సుబ్రమణ్యం. మండల బీసీ సెల్ అధ్యక్షుడు తోట బాలు. బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బోల గాని సత్యనారాయణ. గ్రామ పార్టీ అధ్యక్షులు గారపాటి శ్రీను. వెలగల అజయ్ . దొంగ మురళి. ఉండవల్లి రామకృష్ణ. బి వంశీ భార్గవ్ .సుంకవల్లి రాజేష్ చౌదరి.నాయకులు పాల్గొన్నారు. .

## అంతర్వేదిలో ఆంజనేయస్వామి ఆలయానికి నూతన రూపు-ఎమ్మెల్యే దేవ వరప్రసాద్





**సఖినేటిపల్లి ఆగస్టు 28 (మీ వార్తా విలేఖరి రవి).**రూ.60 లక్షల పుష్కర నిధులతో పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన అంతర్వేదిలోని ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు రూ.60 లక్షల పుష్కర నిధులతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఆలయాన్ని ఆధునిక సౌకర్యాలతో, భక్తులకు అనుకూలంగా నూతన రూపంలో అభివృద్ధి చేయనున్నారు. పునర్నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం ఆలయం మరింత సుందరంగా మారనుంది. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంపై స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## విధుల్లో ఉన్న పోలీసులకు రాఖీలు కట్టిన హోం మంత్రి "అనిత"









**నక్కపల్లి ఆగస్టు 27 : ( మీ వార్త ప్రతినిధి వార్త )** రాఖీ పౌర్ణమి సందర్భంగా నక్కపల్లిలో విధుల్లో ఉన్న పోలీసులకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాఖీలు కట్టి పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులకు స్వయంగా రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. విధుల్లో ఉన్న పోలీసులు తమ కుటుంబాలకు, సోదరీమణులకు దూరంగా ఉండడం వలన, తమ సోదరీమణులు రాఖీలు కట్టేందుకు అవకాశం ఉండకపోవడంతో, తాను సోదరిగా భావించి పోలీసులకు రాఖీలు కట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి అక్కాచెల్లెమ్మ ఆనందంగా, సురక్షితంగా ఉండాలని హోం మంత్రి ఆకాంక్షించారు. ప్రతి పోలీసు కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పోలీసులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారికి పండుగ శు భాకాంక్షలు తెలిపారు.

# ఆడ పడుచులకు అన్నగా.. అండగా ఉంటా..

మంత్రి సుభాష్‌కు రాఖీ కట్టేందుకు వేలాదిగా తరలివచ్చిన మహిళలు

"అన్నయ్యతో ఒకరోజు" పేరుతో రామచంద్రపురంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

రామచంద్రపురం నియోజవర్గం రూపురేఖలు మారుస్తా

కోటిపల్లి- ముక్తేశ్వరం బ్రిడ్జి నిర్మాణం సాధిస్తా

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్







**రామచంద్రపురం మీ వార్తా ప్రతినిధి ఆగస్టు 28:** అనురాగం, ఆత్మీయత, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను రామచంద్రపురం టౌన్‌హాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు నియోజకవర్గంలోని వేలాది మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి మంత్రికి రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి ఆడపడుచుకు అన్నగా అండగా ఉంటానని, వారి కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని తెలిపారు. రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టే పండుగ మాత్రమే కాదని, అనురాగం, ఆత్మీయత, ఆత్మవిశ్వాసంతో కూడిన బంధాలను మరింత బలోపేతం చేసే పండుగ అని పేర్కొన్నారు.

**కోటిపల్లి ముక్తేశ్వరం బ్రిడ్జి నిర్మాణం సాధిస్తా**

రామచంద్రపురం నియోజవర్గం అభివృద్ధికి గడచిన రెండేళ్లలో 250 కోట్లు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశామని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గ రూపురేఖలు మార్చే దిశగా ప్రణాళికను సిద్ధం చేశామని వెల్లడించారు. రానున్న కాలంలో కోటిపల్లి ముక్తేశ్వరం బ్రిడ్జి నిర్మాణం సాధించి తీరుతానని మంత్ర ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి చేయంగా నియోజవర్గ అభివృద్ధికి చిత్త శుద్ధితో పనిచేస్తానన్నారు.

**మహిళా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

మహిళల సంక్షేమానికి, వారి ఆర్థిక పరిపుష్టికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సుభాష్ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు.

ధైర్యం కోల్పోవద్దు.. ఆత్మహత్యలకు పాల్పడవద్దు

ఇటీవల కాలంలో కొంతమంది వచ్చిన సమస్యలకు భయపడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనివల్ల కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని మహిళ లోకానికి అభయమించారు.

**సేవ కోసమే రాజకీయాల్లోకి..**

రామచంద్రపురమే నా శాశ్వత చిరునామా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని.. రామచంద్రపురం నియోజవర్గంలోనే శాశ్వతంగా ఉంటానని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో రామచంద్రపురం నియోజవర్గం భవిష్యత్తులో జనరల్ అవుతుందని, మంత్రి సుభాష్ అమలాపురం వెళ్ళిపోతారు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, శాశ్వతంగా రామచంద్రపురం నియోజవర్గంలోనే ఉంటానని హామీ ఇచ్చారు.

**మహిళలతో కలిసి ప్రేమ విందు**

రక్షాబంధన్ సందర్భంగా నియోజకవర్గంలోని మహిళల కోసం మంత్రి సుభాష్ ప్రత్యేకంగా ప్రేమ విందు ఏర్పాటు చేశారు. మహిళలతో కలిసి మంత్రి భోజనం చేస్తూ వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. మహిళలు తమ సమస్యలను మంత్రికి వివరించగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

**ఆటలు.. పాటలు.. సందడి**

రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా మహిళలకు ఉత్సాహాన్ని కలిగించేలా పలు వినోద కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. నృత్యం, పాటల పోటీలు, అంత్యాక్షరి, టగ్ ఆఫ్ వార్, కుర్చీలాట తదితర పోటీలను నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు మంత్రి సుభాష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వేడుకల్లో మహిళలు మంత్రి సుభాష్‌కు రాఖీలు కట్టి, ఆయనకు తమ ఆత్మీయతను తెలియజేశారు. కార్యక్రమం మొత్తం సందడి, ఉత్సాహంతో సాగింది.

అనంతరం రాఖీ వేడుకలకు హాజరైన ఆడపడుచులకు నూతన వస్త్రాలు మంత్రి తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్,కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, వేలాదిమంది మహిళలు, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున మహిళలు హాజరై రక్షాబంధన్ వేడుకలను విజయవంతం చేశారు.

# ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ లో సవరణలు చేయాలి

సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపునివ్వాలి

డీఈఓ కు వినతి పత్రం అందజేసిన ఏపీటీఎఫ్ (1938)



**భీమవరం ఆగస్టు 28 (మీ వార్త ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇన్ - సర్వీస్ ఉపాధ్యాయుల కోసం విడుదల చేసిన ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ లో సవరణలు చేయాలని ఏపీటీఎఫ్ (1938) పశ్చిమగోదావరి జిల్లా శాఖ నాయకత్వం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా డీఈవో ఓ వీ ఎస్ అనిల్ కుమార్ గారికి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ (1938) పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణ, హరికృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తులను పట్టించుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ ఇవ్వడంపై ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(1)ని సవరించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని నాయకులు కోరారు. 2010కి ముందు విధుల్లో చేరిన సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తిగా మినహాయింపు కల్పించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులందరికీ టెట్ అర్హత మార్కులను సమానంగా 40 శాతంగా నిర్ణయించాలని, ఆన్లైన్లో కాకుండా ఆఫ్లైన్ లో ఓ ఎం ఆర్ విధానంలో టెట్ పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు వారు బోధించే సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే వచ్చేలా సిలబస్లో మార్పులు చేయడంతో పాటు, పరీక్షను డిసెంబర్-2026 నెలలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమిళనాడు ప్రభుత్వ తరహాలోనే, రాష్ట్ర ప్రభుత్వం కూడా సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ సంఘాలు సూచించిన టెట్ సవరణలను స్పెషల్ టెట్ నోటిఫికేషన్ లో చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖ అధికారి ఓ వీ ఎస్ అనిల్ కుమార్ కి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ (1938) జిల్లా కార్యవర్గ సభ్యులు టి.ఆనంద్ ప్రసాద్, ఎ ఎన్ వి సుభాషిణి, పి.నాగరాజు, వేమూరి శ్రీవల్లి, కొల్లాబత్తుల జాన్ మోజెస్, పెద్దాడ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రుద్రార్చన -- సిందూరార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహణ

భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు



**మచిలీపట్నం ఆగస్టు 28(మీ వార్త ప్రతినిధి)** భక్తి, ఆధ్యాత్మికత మరియు సామాజిక ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన రుద్రార్చన -- సిందూరార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 86 మంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, రుద్రార్చన మరియు సిందూరార్చనలో భక్తిపూర్వకంగా పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు,కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు శివునికి రుద్రార్చన నిర్వహించి, అమ్మవారికి సిందూరార్చన సమర్పించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తుల్లో భక్తిభావం, ఆత్మీయత మరియు సమాజంతో అనుబంధం మరింత బలపడింది. సాంప్రదాయ పూజా విధానాలను సామూహికంగా నిర్వహించడం ద్వారా మన సనాతన ధార్మిక సంప్రదాయాల పట్ల యువతతో పాటు సమాజంలోని అన్ని వర్గాల్లో అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రముఖుల పాల్గొనడం,ఈ కార్యక్రమంలో శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీ దూళిపాల రాము, శ్రీ హరికృష్ణ, శ్రీ వర్రే రాజశేఖర్, శ్రీ బ్రహ్మం, శ్రీనివాసు, శ్రీ కూనపురెడ్డి బ్రహ్మయ్య, శ్రీ కూనపురెడ్డి సుబ్బారావు, శ్రీ అన్నవరపు పిచ్చిబాబు, శ్రీ గోకంటి కోటేశ్వరరావు, శ్రీ పనుగంటి ఈశ్వరరావు, శ్రీ కోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. వారి భాగస్వామ్యంతో కార్యక్రమం మరింత ఉత్సాహభరితంగా సాగింది. నిర్వాహకులు చేసిన ఏర్పాట్లను భక్తులు అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజ ఐక్యత రుద్రార్చన, సిందూరార్చన వంటి సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ప్రజలను ఒకచోటకు చేర్చి పరస్పర ఆత్మీయతను పెంపొందించడంలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ధార్మిక సంప్రదాయాలను కాపాడుతూ, వాటి ప్రాధాన్యతను భవిష్యత్ తరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు అన్నారు. భక్తి, సేవ, సంస్కృతి మరియు సమాజ ఐక్యతకు ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. భక్తులకు కృతజ్ఞతలుకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన 86 మంది భక్తులకు, అలాగే కార్యక్రమ నిర్వహణకు సహకరించిన నిర్వాహకులు, కార్యకర్తలు మరియు స్థానిక పెద్దలకు వి హెచ్ పి జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్ మరియు వి హెచ్ పి ప్రభారి శ్రీ పి వి ఎస్ నాయుడు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భక్తుల సహకారం, నిర్వాహకుల సమన్వయం వల్లే కార్యక్రమం విజయవంతంగా జరిగిందని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సనాతన ధార్మిక సంప్రదాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా, సమాజంలో భక్తి మరియు ఐక్యతను పెంపొందించే మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు తెలిపారు.

## విద్యుత్ అమరవీరుల స్ఫూర్తి ని కొనసాగిదాం



**పెద్దాపురం ఆగస్టు 28 న్యూస్ (మీ వార్త ప్రతినిధి)** 2000 ఆగస్టు 28 న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలకు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా హైదరాబాద్ బషీర్ బాగ్ లో జరిగిన మహత్తర విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామి సిపిఎం ఆధ్వర్యంలో పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనం లో నివాళి అర్పించడంజరిగింది. సిపిఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, చింతల సత్యనారాయణ అమరవీరుల చిత్రపటలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు ఆదేశాలను అమలు చేయాలని ప్రయత్నించ్చిన నాటి చంద్రబాబు ప్రభుత్వం ప్రజా ప్రతీఘటన ఎదుర్కోవాల్సి వచ్చింది అన్నారు. రాక్షసంగా నాటి చంద్రబాబు ప్రభుత్వం ముగ్గురు ప్రాణాలు బలితీసుకుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రకరకాల పేర్లతో ప్రజలపై వేస్తున్న విద్యుత్ చార్జీల భారాలు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. అదానీ కి లాభాలు పండిస్తూ, ప్రజలపై భారాలు వేసే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు డి సత్యనారాయణ, అప్పన్న,నరసింహామూర్తి, కూనిరెడ్డి అరుణ, రొంగల సుబలక్ష్మి, గునురి రమణ, చల్లా విశ్వనాధం, యాసలపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బలుసులమ్మ అమ్మవారికి వైభవంగా కోటి పుష్పార్చన



**తాడేపల్లిగూడెం ఆగస్టు 29 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం గ్రామదేవత శ్రీ బలుసులమ్మ అమ్మవారికి శుక్రవారం కోటి పుష్పార్చన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వర్షాలు సరిగా లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలని, కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా పనిచేసేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. తాడేపల్లిగూడెం ప్రజలకు బలుసులమ్మపై ఎంతో నమ్మకం ఉందని, ఆమె దయ లేకుండా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేమని అన్నారు. కోటి పుష్పాలతో పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అన్నదానం నిర్వహించిన దాత కిర్లంపల్లి ఆదినారాయణను, కోటి పుష్పాలను సమర్పించిన దుర్గా క్లాత్ షో రూం అధినేత కోరా వెంకటనారాయణమూర్తి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అంతకుముందు పట్టణ ప్రధాన రహదారిలో భక్తులు కోటి పుష్పాలతో అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు, నీలం సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా చెముడులంక దుర్గమ్మ వారి జాతర మహోత్సవం



**ఆలమూరు, ఆగస్టు 28(మీ వార్త ప్రతినిధి )** ఆలమూరు మండలం చెముడులంక జాతీయ రహదారి చెంత వేంచేసి యున్న చంటి బిడ్డల తల్లి విజయ దుర్గమ్మ వారి జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. రాత్రివేళల్లో జాతర నిర్వహించడం వల్ల శాంతిభద్రతల సమస్యలు వస్తున్నందుమ పోలీసుల సూచనలు మేరకు ఆలయ కమిటీ మధ్యాహ్నం నుంచే ఈ జాతరను ప్రారంభించారు. బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాలు,గరగ నృత్యాలు, అనేక సాంస్కృతి కార్యక్రమాలతో ఈ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారి చెంతన ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నందున హైవే అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు తగు ఏర్పాట్లు చేశారు. అలాగే స్థానిక ఎసై టి.నరేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## డి.ఆర్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాబ్ మేళా

ఆరుగురు విద్యార్థులకు ఉద్యోగాలు



**తాడేపల్లిగూడెం ఆగస్టు 28 (మీ వార్త ప్రతినిధి)** స్థానిక డి.ఆర్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు వికాస సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. ఈ జాబ్ మేళాలో సుమారు 10 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని, 27 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 15 మంది విద్యార్థులు షార్ట్‌లిస్ట్ కాగా, ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుని ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీమన్నారాయణకి,జేకేసీ కో-ఆర్డినేటర్ ఎ.జి. ఆంజనేయులుకి,అలాగే బోధనా మరియు బోధనేతర సిబ్బందికి కళాశాల యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. ఎంపికైన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించింది.

# ముత్యాలమ్మ ఆలయంలో ఘనంగా రుద్రార్చన -- సిందూరార్చన

## దైవభక్తితో పాటు దేశభక్తిని పెంపొందించాలి: వి హెచ్ పి కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్



**మచిలీపట్నం ఆగస్టు 28(మీ వార్త ప్రతినిధి)** విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా వారి సహకారంతో సర్కిల్‌పేటలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి 6:30 గంటలకు రుద్రార్చన -- సిందూరార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 91 మంది మహిళా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సామూహికంగా పూజల్లో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. కార్యక్రమంలో శ్రీ కూనపురెడ్డి శ్రీనివాసరావు, శ్రీ ఘంటసాల సురేష్, శ్రీ దూళిపాల రాము, శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీమతి విజయమ్మతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి హెచ్ పి కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్ మాట్లాడుతూ, దైవభక్తి మనలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తే, దేశభక్తి మనలో దేశం పట్ల బాధ్యతను, సేవాభావాన్ని పెంచుతుందని అన్నారు. భారతీయ జీవన విధానంలో దైవభక్తి, దేశభక్తి రెండూ పరస్పరం విడదీయరాని విలువలని పేర్కొన్నారు. ఆలయాలు కేవలం పూజా స్థలాలుగా కాకుండా ధార్మిక చైతన్యం, సామాజిక ఐక్యత, సేవాభావం మరియు దేశభక్తిని పెంపొందించే కేంద్రాలుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరిలో భక్తితో పాటు భారతమాత పట్ల గౌరవం, దేశం పట్ల బాధ్యత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. "వందేమాతరం" భారతమాత పట్ల మన గౌరవానికి, దేశభక్తికి ప్రతీక అని పేర్కొంటూ, ఆలయాల్లో జరిగే కార్యక్రమాల్లో భక్తితో పాటు సామూహికంగా వందేమాతరం ఆలపించే సంప్రదాయాన్ని ప్రోత్సహించాలని డా. శ్రీనాథ్ పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన 91 మంది మహిళా భక్తులకు, అలాగే కార్యక్రమ నిర్వహణకు సహకరించిన రామకృష్ణ సేవా సమితి నిర్వాహకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక పెద్దలకు వి హెచ్ పి కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్, జిల్లా ప్రభారి శ్రీ పి వి ఎస్ నాయుడు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భక్తుల సహకారం, నిర్వాహకుల సమన్వయం, కార్యకర్తల కృషి వల్లే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించగలిగామని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సనాతన ధార్మిక సంప్రదాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు దైవభక్తి, దేశభక్తి, సేవాభావం మరియు సామాజిక ఐక్యతను పెంపొందించే మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. "దైవభక్తి నుంచి దేశభక్తి... దేశభక్తి నుంచి సమాజసేవ" అనే స్ఫూర్తితో కార్యక్రమాలను కొనసాగిస్తామని వి హెచ్ పి నాయకులు తెలిపారు.

# తాండ్ర రాజేష్ ఆధ్వర్యంలో వైయస్ జగన్ శ్రీమతి భారతి దంపతుల పెళ్లిరోజు వేడుకలు వేడుకలు..



**కుక్కునూరు ఆగస్టు 28 (మి వార్తా ప్రతినిధి)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీమతి వై ఎస్ భారతి వివాహ వార్షికోత్సవం సందర్భంగా కుక్కునూరు మండలంలో పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు... కుక్కునూరు మండల పార్టీ అధ్యక్షులు తాండ్ర రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు... ఈ సందర్భంగా తాండ్ర రాజేష్ గారు కేక్ కట్ చేసి, నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి -- భారతిలకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు... ఈ సందర్భంగా తాండ్ర రాజేష్ మాట్లాడుతూ, వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి -- శ్రీమతి వై.ఎస్ భారతి ఆదర్శ దంపతులుగా మరెన్నో ఆనందమైన సంవత్సరాలు కలిసి సాగాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామని వారి దాంపత్య జీవితం ఎల్లప్పుడూ ప్రేమానురాగాలతో, ఆనందాలతో నిండిపోవాలని కోరుకుంటున్నాం" అని అయన అన్నారు... ఈ కార్యక్రమంలో దాచారం ఎంపీటీసీ సోడే సాధు, నియోజకవర్గ బూత్ విభాగ కమిటీ అధ్యక్షులు కంభంపాటి షణ్ముక్ సాయి, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు మల్లేలా చంటి నాయుడు, మండల ఉపాధ్యక్షులు రాయి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి పగిల్లా అల్లేశ్, మండల యూత్ అధ్యక్షులు చేకూరి నవీన్ వర్మ, గణపవరం పంచాయితీ అధ్యక్షులు ఎల్లంకి లక్ష్మణ్ రావు, రాయి మధు, దాడి వెంకన్న, వేల్పుల శ్రీనివాసరావు, మారపక రాము, మచ్చ మల్లేష్, గంజి వెంకట్రావ్, మరియు అన్ని బూత్ లేవల ఏజెంట్స్, నాయకులూ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# పాఠశాలల్లో ఐటీడీఏ బృందం తనిఖీ





**కుకునూరు ఆగస్టు 28 (మి వార్తా ప్రతినిధి)** :మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు (జీపీఎస్), ఆశ్రమ ,కేజీబీవీ కుకునూరు పాఠశాలలను, ఐటీడీఏ అధికారుల బృందం సందర్శించి పరిశీలించింది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలపై అధికారులు ఆరా తీశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, పాఠశాలల నిర్వహణ తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం కుకునూరులో నిర్వహిస్తున్న ఎస్ఎల్ఏఎస్ (ూూూూ) పరీక్షను ఐటీడీఏ డిప్యూటీ డీఈఓ రవి ప్రసన్నకుమార్ పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాజరు, పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఎస్ఎల్ఏఎస్ పరీక్షలు దోహదపడతాయని అధికారులు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు నిరంతరం బడి మానివేయటం పట్ల సీఎంఓ వివరాలు అడిగి తెలుసుకున్నారు పాఠశాలలో విద్యార్థులు హాజరు శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల మానేయటం పట్ల ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ చూపి హాజరు శాతం పెంచాలన్నారు ఈ పర్యటనలో ఏఎంఓ శిరమయ్య, సీఎంఓ సున్నం శ్రీను, అసిస్టెంట్ ఏఎంఓ మోడియం రమణ, +జణూ రాజేశ్వరి కుకునూరు మండల విద్యాశాఖాధికారి ధనలక్ష్మి, ఆశ్రమ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు మంగమ్మ, రామసింగార స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు రామకృష్ణ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

## కుక్కునూరు, వేలేరుపాడు పోలీసులకు ప్రాణరక్షణ శిక్షణ -- బీమా పథకాల వివరాలు



**కుక్కునూరు, వేలేరుపాడుఆగస్టు 28 (మి వార్తా ప్రతినిధి)** ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ వారు పోలవరం డీఎస్పీ శ్రీ జయ కృష్ణ గారి యొక్క ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సాధన కార్యక్రమంలో భాగంగా జూ= శిక్షణ, బీమా పథకాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా కుక్కునూరు సర్కిల్ పోలీసు సిబ్బందికి అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలవరం డీఎస్పీ శ్రీ జయకృష్ణ గారి పర్యవేక్షణలో, కుక్కునూరు సీఐ శ్రీ బాల సురేష్ బాబు, కుక్కునూరు ఎస్ఐ శ్రీ రాజారెడ్డి, వేలేరుపాడు ఎస్ఐ శ్రీ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కుక్కునూరు, వేలేరుపాడు పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించే విధానాలపై అవగాహన పొందారు. సర్కిల్ సిబ్బందికి జూ= (ఝతీఎఅశీజూబశ్రీఎశీఝతీఎ =వంబంఎ్‌ఖ్‌అశీఅ)లిపై వైద్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రాక్టికల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండె స్పందన అకస్మాత్తుగా ఆగిపోయిన వ్యక్తిని గుర్తించడం, వెంటనే స్పందించడం, వైద్య సహాయం అందే వరకు అందించాల్సిన ప్రాథమిక ప్రాణరక్షణ చర్యలను వైద్యులు సిబ్బందికి వివరించారు. జూ=ను సరైన పద్ధతిలో నిర్వహించడం, అత్యవసర సమయంలో ధైర్యంగా వ్యవహరించడం, వెంటనే వైద్య అత్యవసర సేవలకు సమాచారం అందించడం వంటి అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. పోలీసు విధుల్లో ఎప్పుడైనా అత్యవసర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, ప్రతి పోలీసు సిబ్బందికి ప్రాథమిక ప్రాణరక్షణ నైపుణ్యాలపై అవగాహన ఉండటం ఎంతో అవసరమని అధికారులు తెలిపారు. అనంతరం పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి (బ్యాంక్ మాస్టర్) ద్వారా పోలీసు సిబ్బందికి అందుబాటులో ఉన్న హెల్త్ ఇన్సూరెన్స్, పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాల గురించి వివరించారు.

ఆయా బీమా పథకాల ప్రయోజనాలు, అర్హతలు, కుటుంబానికి కలిగే ఆర్థిక భద్రత, పాలసీ తీసుకునే విధానం తదితర అంశాలను సిబ్బందికి వివరించి, అవసరమైన సందేహాలను నివృత్తి చేశారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో నైపుణ్యంతో పాటు తమ ఆరోగ్యం, కుటుంబ ఆర్థిక భద్రతపై కూడా శ్రద్ధ వహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా జూ=పై ప్రాక్టికల్ నైపుణ్యం, బీమా పథకాలపై అవగాహన కల్పించారు.



## కనుల పండుగగా శ్రీ కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్ట





**బాలయపల్లి ( నెల్లూరుజిల్లా )ఆగస్టు 28 (మీ వార్తా ప్రతినిధి)** కోదండ రామ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం దాసరి పెంచలయ్య,దాసరి వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా బాలయపల్లి మండలం భైరవరం గ్రామం ఎస్టి కాలనీ నందు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి అధ్యక్షులు రాయి సత్యం నాయుడు హాజరయ్యారు. అనంతరం రాయి సత్యం నాయుడు మాట్లాడుతూ ఎస్టీ కాలనీ ఎన్నో సంవత్సరాల నిరీక్షణకు శ్రీరాముడు స్వామివారికి ప్రాణ ప్రతిష్ట నిర్వహించారు. ఈ 41 రోజులు గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉండి పూజలు నిర్వహించాలని అదేవిధంగా శ్రీరాముని కృప గ్రామ ప్రజలపై ఉండాలని, గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన టిడిపి నాయకులు దాసరిపెంచలయ్య,వెంకటేష్ లను అభినందించారు. మరియు ఎస్టి కాలనీ గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్ని సంవత్సరాలు మా కల నెరవేరినందుకు దాసరి పెంచలయ్య,వెంకటేష్ లకు కృతజ్ఞతగా ఉంటామని తెలియజేశారు

## జెన్-జీ యువత ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేస్తా - ఎమ్మెల్యే కోటంరెడ్డి





**నెల్లూరు రూరల్ ఆగస్టు 28 (మీ వార్త ప్రతినిధి)** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని అన్నమయ్య సర్కిల్ శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ లో విద్యార్థిని విద్యార్థులతో ఆత్మీయ భేటీ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ విద్యార్థిలను ఉద్దేశించి అయన మాట్లాడుతూ యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. నిత్యం ప్రజల్లో ఉండడం నాకు ఇష్టం. నేను ఎల్లప్పుడూ ప్రజల పక్షమే. గత 3ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ప్రజలు నన్ను ప్రజలు ఆదరించారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. యువత భవిష్యత్తు కోసం నారా లోకేష్ బంగారు బాట వేస్తున్నారని,జెన్-జీ యువత అంటే నాకెంతో ఇష్టం. వారి ఆకాంక్షలకు అనుగుణంగా నెల్లూరు రూరల్ లో స్థానిక శాసనసభ్యుడుగా పనిచేస్తానని పేర్కొన్నారు.

## మార్గం మధ్యలో నిలిచిన బస్సు... ప్రయాణికులు అవస్థలు





**జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29 ( మీ వార్త ప్రతినిధి ):** జంగారెడ్డిగూడెం గూడెం నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కామవరపుకోట మండలం కిలారు ఫార్మ్ సమీపంలో మార్గమధ్యంలో నిలిచిపోయింది. బస్సు సడన్‌గా ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి వేరే బస్సుల కోసం సుదీర్ఘంగా ఎదురుచూడాల్సి వచ్చింది. ?జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన పలు బస్సులు తరచూ సాంకేతిక లోపాలతో ఇలాగే నడమంత్రంలో ఆగిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు ఈ బస్సుల మొరాయింపుల వల్ల సమయానికి గమ్యస్థానాలకుచేరలేకపోతున్నారు. డిపో అధికారులు స్పందించి పాతబడిన బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని, ప్రయాణికుల ప్రాణాలతో, సమయంతో చెలగాటమాడుతున్న సిబ్బందిపై మరియు అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## విద్యార్థుల అభ్యసన స్థాయిని అంచనా వేసేందుకే ఎస్.ఎల్.ఏ.ఎస్.

### మండల విద్యాశాఖ అధికారి-1 ఎం.శ్రీనివాస్



**పెంటపాడు ఆగస్టు 28 (మీ వార్త ప్రతినిధి)** పాఠశాల విద్యార్థుల తరగతి వారీ అభ్యసన స్థాయిలను అంచనా వేయడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్.ఎల్.ఏ.ఎస్. (స్టేట్ లెర్నింగ్ అసెస్మెంట్ సర్వే) రాష్ట్రస్థాయి అభ్యసన స్థాయి అంచనా పరీక్ష ఒక కొలమానంగా ఉంటుందని పెంటపాడు మండల విద్యాశాఖ అధికారి-1 ఎం. శ్రీనివాస్ అన్నారు. ఎంఈఓ-1 శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం 4, 7, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన స్థాయిలను,సామర్థ్యాలను పరిశీలించడానికి శుక్రవారం మండలంలోని 20 పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా పెంటపాడు మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న (గత సంవత్సరపు నాలుగో తరగతి) విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎస్.ఎల్.ఏ.ఎస్ పరీక్ష నిర్వహణ విధానాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిమామిళ్ల పెద్దిరాజు పాల్గొన్నారు.

# రక్షాబంధన్‌తో అన్నాచెల్లెళ్ల అనుబంధం మరింత బలోపేతం

ప్రేమ, విశ్వాసం, ఆప్యాయతలకు ప్రతీకగా పవిత్ర రక్షాబంధనం -- జీవితాంతం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షలు.

**పోలవరం మీవార్త ఆగస్టు 28**: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయతకు, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను దేశవ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న అపూర్వమైన ప్రేమ, పరస్పర విశ్వాసం, ఆప్యాయత, ఆదరాభిమానాలను మరింత బలపరిచే పవిత్రమైన రోజుగా రక్షాబంధన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఈ సందర్భంగా చెల్లెలు తన అన్నకు రాఖీ కట్టి, అన్నయ్య తన చెల్లెలికి జీవితాంతం అండగా నిలుస్తాననే భరోసాను అందించడం ఈ పండుగలోని ప్రధాన భావన. రాఖీ అనే పవిత్రమైన దారం కేవలం ఒక బంధానికి గుర్తు మాత్రమే కాకుండా, అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధం, బాధ్యత, నమ్మకాలకు ప్రతీకగా నిలుస్తుంది. చిన్ననాటి నుంచి కలిసి పెరిగిన అన్నాచెల్లెళ్ల మధ్య ఎన్నో మధురమైన జ్ఞాపకాలు, సరదా తగాదాలు, ఆప్యాయతలు, కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలిచిన సందర్భాలు ఈ బంధాన్ని మరింత ప్రత్యేకంగా మారుస్తాయి. కాలం మారినా, పరిస్థితులు మారినా అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే ప్రేమాభిమానాలు ఎప్పటికీ చెదరిపోకూడదనే ఆకాంక్షతో రక్షాబంధన్ వేడుకలను నిర్వహిస్తున్నారు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, ఎన్ని దూరాలు ఏర్పడినా అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న అనుబంధం మాత్రం ఎప్పటికీ నిలిచి ఉండాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు. ఈ పవిత్రమైన రోజున అన్నాచెల్లెళ్ల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రేమానురాగాలు మరింత పెరగాలని, ఒకరికొకరు జీవితాంతం తోడుగా నిలుస్తూ పరస్పర గౌరవం, విశ్వాసం, ఆదరాభిమానాలతో ముందుకు సాగాలని పలువురు ఆకాంక్షించారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా, ఆప్యాయతలకు విలువను గుర్తుచేసే పండుగగా రక్షాబంధన్ నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో ఉరుకులు పరుగుల జీవితంలో కుటుంబ సభ్యుల మధ్య దూరాలు పెరుగుతున్న తరుణంలో రక్షాబంధన్ వంటి పండుగలు బంధాలను మళ్లీ దగ్గర చేస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. అన్నాచెల్లెళ్ల మధ్య చిన్ననాటి మధురానుభూతులను గుర్తుచేస్తూ, ఒకరి కష్టాల్లో మరొకరు తోడుగా ఉండాలనే సందేశాన్ని ఈ పండుగ



అందిస్తుంది. అన్నాచెల్లెళ్ల బంధం జన్మజన్మల అనుబంధంగా, ప్రేమకు ప్రతీకగా, నమ్మకానికి నిదర్శనంగా ఎల్లప్పుడూ కొనసాగాలని, వారి జీవితాలు ఆయురారోగ్యాలు, ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో నిండాలని ఈ రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా అందరూ ఆకాంక్షిస్తున్నారు.

# గాడాలలోఅంగరంగవైభవంగా శ్రీశ్రీ శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి కుంకుమ పూజలు







500చీరలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

**కోరుకొండ ఆగస్టు 28 (మీ వార్తప్రతినిధి)**
తూర్పుగోదావరిజిల్లాకోరుకొండమండలంగాడాల గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా పడాల పండుఆధ్వర్యంలో, ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలోమహిళలు,భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకునిప్రత్యేకపూజలునిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో నిండిపోయిది. ఈ ఆలయం నిర్మించి 18 సంవత్సరాలుఅవుతుందని, అప్పటినుండి పిల్లలు లేని భార్య భర్తలు ఇద్దరు వడి కట్టించుకొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లిస్తారని వారికి పిల్లలు కలుగుతారనినమ్మకంఈ తల్లి పై ఉందని అలా చాలా జంటలకు పిల్లలు కలిగారని పడాల పండు తెలిపారు. అలాగే కొన్ని కొన్ని సమస్యలు, ప్రమాదాలతో ఉన్నప్పుడు మొక్కుకున్నవారుపటికబెల్లం తులాభారాలను ఇచ్చి,పసుపు, కుంకుమ, పూలు, కొబ్బరికాయలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతోఉండాలనిప్రార్థించారు. శ్రావణమాసం మూడో శుక్రవారం కుంకుమ పూజ సందర్భంగా ఆలయ అర్చకులు 500 చీరలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, వివిధరకాలపూజాకార్యక్రమాలనునిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారి పూజలు కొనసాగాయి. భక్తులు భక్తిపారవశ్యంతోఅమ్మవారినిదర్శించుకునితీర్థప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి కృపతోతమకుటుంబాల్లో శుభకార్యాలు, ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి, సంతాన సౌభాగ్యం కలగాలని కోరుకున్నామని పలువురు భక్తులు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మహా అన్న సమారాధన నిర్వహించారు.

# పోలవరం ఎడమ కాలువ జల హారతికి వచ్చే నెల 2 న పాయకరావుపేటకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక,,

**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,ఆగస్టు 28** : పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాల విడుదల సందర్భంగా నిర్వహించనున్న జల హారతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చే నెల 2 న పాయకరావుపేటకు రానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ నీటి విడుదల ప్రాంతాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి విడుదల ప్రాంతం, సభా ప్రాంగణం, హెలిపాడ్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పిఎల్ పురం వద్ద ఏర్పాటు చేయనున్న సభా ప్రాంగణం, హెలిపాడ్ ప్రాంతాలను కూడా మంత్రులు పరిశీలించారు. సీఎం పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, భారీగా తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే



బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఏపీ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, చింతకాయల రాజేష్‌తో పాటు జిల్లా అధికారులు, పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ... ముఖ్యమంత్రి



చంద్రబాబు అపర భగీరథుడని కొనియాడారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు రావడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పోలవరం ఎడమ కాలువ నీటి విడుదల ద్వారా ఉత్తరాంధ్ర రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. పోలవరం కల సాకారం కావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని హోం మంత్రి అనిత సూచించారు.

## విధుల్లో ఉన్న పోలీసులకు రాఖీలు కట్టిన హోం మంత్రి అనిత,,





**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,**ఆగస్టు 28 : రాఖీ పౌర్ణమి సందర్భంగా నక్కపల్లిలో విధుల్లో ఉన్న పోలీసులకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులకు స్వయంగా రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ... విధుల్లో ఉన్న పోలీసులు తమ కుటుంబాలకు, సోదరీమణులకు దూరంగా ఉండడం వలన, తమ సోదరీమణులు రాఖీలు కట్టేందుకు అవకాశం ఉండకపోవడంతో తాను సోదరిగా భావించి పోలీసులకు రాఖీలు కట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి అక్కాచెల్లెమ్మ ఆనందంగా, సురక్షితంగా ఉండాలని హోం మంత్రి ఆకాంక్షించారు. ప్రతి పోలీసు కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పోలీసులతో ఆత్మీయంగా ముచ్చటించి వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లపై ముమ్మర సమీక్ష...



**నరసాపురం ; ఆగస్టు 28 మీ వార్తా జిల్లా ప్రతినిధి.** సెప్టెంబర్ 1న నరసాపురం నియోజకవర్గంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో, ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఈరోజు పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.
పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగరాణి (xూూ) , ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మీ , జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ , =ఱూ దాసిరాజు , ఱూ సుధాకర్ రావు , నరసాపురం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు , నరసాపురం కమిషనర్ మరియు తహసీల్దార్లతో కలిసి బహిరంగ సభా ప్రాంగణాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసే దిశగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

## ఆకుల వారి ఓణి ఫంక్షన్ లో పాల్గొన్న డాక్టర్ చల్లా.



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి, ఆగస్టు, 28** మండల కేంద్రం ఆలమూరు పసుపులేటి వారి గూడెంలో జరిగిన ఆకుల దుర్గారావు, అరుణ దంపతుల కుమార్తె,తాతయ్య అమ్మమ్మ మానేపల్లి శ్రీను, సత్యవతి చేతులు మీదుగా చిరంజీవి జ్యోతిప్రియ ఓణి ఫంక్షన్ అత్యంత వైభవంగా, ఘనంగా జరిగినది. ఈ వేడుకలో పాల్గొని చిన్నారి జ్యోతిప్రియ ను ఆశీర్వదించి, దీవించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు,వాణి దంపతులు. ఈ కార్యక్రమంలో ఆకుల సూర్యనారాయణ, రత్నం, ఆచంట సాయి,లక్ష్మి, దేగల రాధ, తోలేటి గోపాలకృష్ణ, కామాక్షి,పాలంగి నాగదేవి,పైడికొండల బాబి, పైడికొండల వెంకటేష్, చిన్నం సాయి,కొమ్మిశెట్టి సుధీర్, టేకి శివగణేష్,చల్లా సందీప్, మానేపల్లి సతీష్,మానేపల్లి దుర్గారావు,షేక్ వల్లి,కొరిపెల్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

## పాయకరావుపేట శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు,,



**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,**,ఆగస్టు 28 : పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో శుక్రవారం రక్షా బంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు తమ తోబుట్టువులకు ప్రేమానురాగాలకు ప్రతీకగా రాఖీలు కట్టి వారి ఆశీర్వాదాలను తీసుకున్నారు.
ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎంవి సురేష్ మాట్లాడుతూ... రక్షాబంధన్ పండుగ యొక్క విశిష్టతను, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనుబంధం గురించి వివరించారు. రీజనల్ ఇంచార్జి గోపీనాథ్ విద్యార్థులకు రక్షాబంధన్ పండుగ యొక్క ప్రాముఖ్యతను, భారతీయ సంస్కృతిలో సోదర, సోదరి బంధానికి ఉన్న ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామరాజు, డీన్ మనీష్, ఇంచార్జిలు శ్రీనివాసు, కల్పన, గౌరీ, త్రిమూర్తులు, ఏఓ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచుల రక్షణ గౌరవం మనందరి బాధ్యత : వలవల బాబ్జి



**తాడేపల్లిగూడెం ఆగస్టు 28 (మీ వార్త ప్రతినిధి)** మహిళలపై మానభంగం, అత్యాచారాలు,దౌర్జన్యాలు, దోపిడీ అధికం అయిన నేటి తరుణంలో ఆడపడుచులకు రక్షణ,గౌరవం కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) అన్నారు. తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాఖీ పండుగ పురస్కరించుకొని తెలుగు మహిళా కార్యకర్తలు ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాబ్జి ఆడపడుచులకు చీరలు బహుకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. బాబ్జి మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అన్నారు. ఆడపడుచుల రక్షణ,గౌరవం మనందరి బాధ్యత అన్నారు. వారి సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి కృష్ణవేణి,కొండ్రెడ్డి హైమావతి,కాకర్ల సుభద్ర,శ్రీరాముల విజయలక్ష్మి,మొండెం లీలా తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించిన సిపిఎం నాయకులు ,,




**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,ఆగస్టు 28 :** స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో ఇళ్ల స్థలాల పోరాటం చేస్తున్న పేదలు సమక్షంలో బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ 2020 విద్యుత్తు అమరవీరుల నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బత్తిన నాగేశ్వరరావు, సేవా చిన్నారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎం సత్యనారాయణ మాట్లాడుతూ... 2000లో అప్పుడు కూడా ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచొద్దని ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న హైదరాబాద్ ఇందిర పార్క్ నుండి అసెంబ్లీకి వెళ్తా ఉంటే బషీర్ బాగ్ వంతెన వచ్చేసరికి వాటర్ ఫిరంగిలో బాష్ప వాయువులు, పొగ బాంబులు ఉపయోగించి విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని పోరుబాటలో ఉన్న కార్యకర్తలపై దమనకాండ చేస్తూ నలుగురిని పొట్టన పెట్టుకున్నారు. అప్పుడున్న తెలుగుదేశం ప్రభుత్వం పొట్టను పెట్టుకుంది. దానికి నిరసనగా ప్రతి సంవత్సరం ఆగస్టు 28వ తారీఖున విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పేదాకా ఈ పోరాటం కొనసాగుతుందని ఇప్పుడు ఆ ఆదాని అంబానీ శిరిడీ ట్రస్ట్ కంపెనీల ద్వారా స్మార్ట్ మీటర్లు బిగించాకూడదని ఎస్సీలకు ఇచ్చే 200 యూనిట్లు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుంది రాష్ట్ర ప్రభుత్వం కూడా దానికివంతా పాడుతుంది. పేద ప్రజలు ఎస్సీలు ఎవరైతే ఉన్నారో వాళ్లకి స్మార్ట్ మీటర్ బిగించద్దని బిగిస్తే తగిన పనిష్మెంట్ ఉంటాదని అన్నారు. ఇప్పటికే విద్యుత్ బారాలు మోయలేక పేద ప్రజలు, ఎస్సీలు అనేక ఇబ్బందులు పడుతున్నారూ. ఒక పక్క పనులు లేక అర్ధాకలీతో జీవిస్తున్నారు. అందువలన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని స్మార్ట్ మెటల్ వేసే విధానాన్ని రద్దు చేయాలని ఎస్సీలు ఎవరైతే ఉన్నారో ఎస్సీలకు బిగించకూడదని అలాగే 13 రోజుల నుంచి పోరాటం చేస్తున్న పట్టాలు ఇచ్చేవరకు పోరాటం కొనసాగుతుందని అవసరమైతే హోం మినిస్టర్ గారిని కలవడానికి కూడా మేము అందరం సిద్ధంగా ఉన్నామని రేపు మూడో న మన రాష్ట్ర ముఖ్యమంత్రి గారు పోలవరం కాలువ నీళ్లు పరిశీలన కోసం రావడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పేదలకి ఇల్లు స్థలాలు ఇస్తారని ఆశిస్తున్నాం. సీఎం గారిని కోరుతున్నాం. అవకాశం ఇస్తే సీఎం గారిని కూడా కలవడానికి మాకు ఎటువంటి అభ్యంతర లేదు. మాసమస్యను విన్నవించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో లోవరత్నం, యేసురత్నం, కుమారి, పావని రమేష్, వేలంగిని, సత్యవతి, దేవుడమ్మ, లీల, లలిత తదితరులు పాల్గొన్నారు.

# నక్కపల్లిలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం

నాలుగు వేల మంది మహిళలతో వైభవంగా నిర్వహించిన హోం మంత్రి అనిత

రాష్ట్ర ప్రజలందరిపై వరలక్ష్మీ దేవి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి

రాబోయే రోజుల్లో పాయకరావుపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుంది

గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు వస్తున్నాయి

గోదావరి జలాలు రావడం ఉత్తరాంధ్ర రైతాంగానికి ఎంతో ఉపయోగం... హోం మంత్రి అనిత






**నక్కపల్లి, ఆగస్టు 28: ( మీ వార్త ప్రతినిధి) :** నక్కపల్లిలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 4 వేల మంది మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, వరలక్ష్మీ దేవికి పూజలు చేశారు. అనంతరం ముత్తైదువులకు హోం మంత్రి అనిత వాయనాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరిపై వరలక్ష్మీ దేవి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఇంటా సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, రాష్ట్రం సుభిక్షంగా, సమృద్ధిగా ముందుకు సాగాలని వరలక్ష్మీ దేవిని కోరుకున్నట్లు చెప్పారు. గత నాలుగు సంవత్సరాలుగా వరలక్ష్మీ వ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని, ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి అనిత అన్నారు. ప్రతి ఒక్కరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం, పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధి చెందాలని, అందరిపై అమ్మవారి అనుగ్రహం ఉండాలని కోరుకున్నానన్నారు. తన కుటుంబంపై ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

ఈ ఇల్లు మనది.. మన ఇంట్లో పండగ అనే భావనతోనే వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తున్నామని మంత్రి అనిత తెలిపారు. రాబోయే రోజుల్లో పాయకరావుపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు రానున్నాయని, పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు రావడం ఉత్తరాంధ్ర రైతాంగానికి ఎంతో ప్రయోజనకరమని అన్నారు. పోలవరం ఒక కల అని, ఆ కల నేడు సాకారం కానుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు రానున్నాయని తెలిపారు.

## త్వరలోనే కొత్త పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం : వలవల బాబ్జి

**తాడేపల్లిగూడెం ఆగస్టు 28 (మీ వార్త ప్రతినిధి)** కొత్త పింఛన్ల కోసం ఎదురు చూసే వారి సంఖ్య అధికంగా ఉందని,దానిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలోనే వృద్ధాప్య, వితంతు పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసినట్లు తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) పేర్కొన్నారు.శుక్రవారం తాడేపల్లిగూడెం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వలవల బాబ్జి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు.ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ ఈ గ్రీవెన్స్ లో అధికంగా వృద్ధాప్య, వితంతు,దివ్యాంగ పింఛన్ల కొరకు, ఇళ్ల స్థలాల కొరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. త్వరలోనే అర్హులైన వారికి వితంతు,వృద్ధాప్య పింఛన్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు తీసి ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా పింఛన్ లను పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోడ్పడుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి,సంక్షేమ పథంలో నడిపిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి,కిలపర్తి వెంకట్రావు,పద్మనాభుని మురళి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## కుర్తి వెన్ను పడతడిక గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకొని పార్టీలోకి చేరడం

ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



**కృత్తివెన్ను ఆగస్టు 28(మీ వార్త ప్రతినిధి)** పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం పడతడిక పంచాయతీ దండుదారి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బొర్రా రాము , పాలపర్తి ఇస్మాయిల్ తెలుగుదేశం పార్టీలో పెడన శాసనసభ్యులు శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ గారి ఆధ్వర్యంలో వీరు తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకొని పార్టీలోకి చేరడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ గారు వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి, టీడీపీ కుటుంబంలో వారికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఈ చేరికలు నిదర్శనమని పేర్కొన్నారు. పెడన నియోజకవర్గంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని నూతనంగా పార్టీలో చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ముగిసిన ఎస్.ఎల్.ఏ.ఎస్. సర్వే : ఎంఈఓ-2 రామకృష్ణ



**పెంటపాడు ఆగస్టు 28 (మీ వార్త ప్రతినిధి)** రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఎస్.ఎల్.ఏ.ఎస్. (స్టేట్ లెర్నింగ్ అసెస్మెంట్ సర్వే) విజయవంతంగా ముగిసింది.పెంటపాడు మండలంలో 3 ప్రైవేటు, 15 ప్రభుత్వ పాఠశాలలు కలిపి మొత్తం 18 పాఠశాలల్లో ఈ సర్వే నిర్వహించారు. 5, 7, 9 తరగతుల విద్యార్థుల నుండి ప్రతి తరగతికి ర్యాండమ్ గా 40 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పరీక్షలు నిర్వహించారు.ఈ సర్వేకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా 28 మంది ఉపాధ్యాయులు, వారిని పర్యవేక్షించడానికి 18 పాఠశాలల నుండి ప్రధానోపాధ్యాయులు పనిచేశారు.ఈ సందర్భంగా పీఎం శ్రీ నోడల్ అధికారి డాక్టర్ టి.వి. రామకృష్ణ మాట్లాడుతూ... విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకొని వారికి అవసరమైన బోధనా పద్ధతులు అమలు చేయడానికి, సిలబస్ తయారు చేయడానికి, రెమిడియల్ తరగతులు నిర్వహించడానికి, వివిధ పాఠశాలల విద్యా అభివృద్ధిని తెలుసుకొని అభివృద్ధి చర్యలు చేపట్టడానికి ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.సర్వేకు సహకరించిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, మండల, జిల్లా స్థాయి అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## 58 వ డివిజన్ రమణ గుట్ట వడ్డెర సంఘం నూతన కార్యవర్గ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**తల్లాడ మీ వార్త ప్రతినిధి.** 28.8.2026 రమణ గుట్ట:
58 వ డివిజన్ రమణ గుట్ట వడ్డెర సంఘం నూతన కార్యవర్గ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం మరియు స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నూతన కమిటీ బాధ్యతలను స్వీకరించింది.

**నూతన కార్యవర్గ వివరాలు:**

అధ్యక్షుడు: ఇరగదిండ్ల ఆశయ
ఉపాధ్యక్షుడు: పల్లపు గోవిందు
ప్రధాన కార్యదర్శి: కుంచపు వెంకటేశ్వర్లు
కోశాధికారి: విడగొట్టి వెంకటేశ్వర్లు
గౌరవ సలహాదారులు: ఆలకుంట అంజయ్య, విడగొట్టి హనుమంతు, మంజల రమేష్

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మరియు సభ్యులు మాట్లాడుతూ, వడ్డెర సంఘం బలోపేతానికి, ప్రజల సంక్షేమానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకులకు, సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112

# 2న పాయకరావుపేటకు సీఎం చంద్రబాబు

**జలహారతి కార్యక్రమానికి ఘనంగా ఏర్పాట్లు**

**అధికారులతో మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర సమీక్ష**

**నక్కపల్లి, ఆగస్టు 28 :( మీ వార్త ప్రతినిధి) :** సీఎం చంద్రబాబు సెప్టెంబర్ 2న అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు సమగ్రంగా వివరించగా.. మంత్రులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. సీఎం చంద్రబాబు పాయకరావుపేట నియోజకవర్గానికి మూడోసారి రాబోతున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పటి నుంచో ఆంధ్రప్రదేశ్ ప్రజల కలగా ఉందని, ఆ కలను సాకారం చేస్తున్న నాయకుడు సీఎం చంద్రబాబు అని అన్నారు. సముద్రంలో కలిసిపోతున్న గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు





తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందని హోం మంత్రి పేర్కొన్నారు. గోదావరి జలాలు అందుబాటులోకి రావడం వల్ల అనకాపల్లి జిల్లాలోని రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. గోదావరి జలాలకు ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రజలు, అధికారులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 ఉత్తరాంధ్ర జిల్లాలకు పండుగ రోజు వంటిదని పేర్కొన్న ఆమె.. సీఎం పర్యటన సందర్భంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి వంటిదని అన్నారు. సెప్టెంబర్ 2న సీఎం చంద్రబాబు పాయకరావుపేట నియోజకవర్గానికి రానున్న నేపథ్యంలో సీఎం పర్యటనలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సూచించారు. సీఎం పర్యటనకు వేలాది మంది ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కొల్లు రవీంద్ర సూచించారు. సభా ప్రాంగణం, రహదారులు, పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకురావడం ద్వారా ఈ ప్రాంత వ్యవసాయానికి మరింత ఊతం లభిస్తుందని మంత్రులు పేర్కొన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడంతో పాటు జలహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనకాపల్లి జిల్లా తరపున సీఎం చంద్రబాబుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీ దుర్గ టెంట్ హౌస్ అధినేత శ్రీ తోట ప్రసన్నాంజనేయులు ,శ్రీమతి ధనలక్ష్మి దంపతులు అన్న ప్రసాద వితరణ

**గుడివాడ ఆగస్టు 28(మీ వార్త ప్రతినిధి)** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ఈరోజు ది28.08.2026 శ్రావణశుక్రవారం సందర్భంగా ఉదయం శ్రీ అమ్మవారి కి పంచామృతఅభిషేకములు అనతరం సహస్రనామ కుంకుమార్చన లు 9.00 నుండి శ్రావణపౌర్ణమి సందర్భంగా శ్రీ అమ్మవారి సన్నిధిలో శ్రీ చండీ హోమము మరియు సాయత్రం 6.00 లకు శ్రీ అమ్మవారికి పంచహారతులు నక్షత్ర హారతి ,పంచదీప హారతి,సింహ హారతి, నాగ హారతి ,కుంభ హారతి ,కర్పూర హారతి నిర్వహించబడినది.మరియు ఈరోజు శుక్రవారం సందర్భంగా శ్రీ అమ్మవారి దేవస్థానంనందు అన్నప్రసాద వితరణ కు సహకరించిన దాతలు వడ్లమన్నాడు వాస్తవ్యులు క్రీ.శే. తోట లక్ష్మయ్యగారి కుమారుడు శ్రీ దుర్గ టెంట్ హౌస్ అధినేత శ్రీ తోట ప్రసన్నాంజనేయులు ,శ్రీమతి ధనలక్ష్మి దంపతులచే అన్న ప్రసాదం వితరణ నిర్వహించబడినది 100 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినారు





సదరు అన్నప్రసాద వితరణకు కానుకలు విరాళములు అందజేయు భక్తులు శ్రీ అమ్మవారి దేవస్థానం సేవింగ్ అకౌంటు నంబర్ 45363190094, ఐ ఎఫ్ ఎస్ సి కోడ్, ఎస్ బి ఐ ఎన్ 0001461, స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా గుడ్లవల్లేరు బ్రాంచి నందు తమ విరాళములను ఆన్లైన్ ద్వారా జమచేసి శ్రీ అమ్మవారి అనుగ్రహమును పొందగలరని, దేవస్థానం చైర్మన్ శ్రీ ఈడే వెంకట విష్ణు మోహనరావు గారు మరియు ధర్మకర్తల మండలి సభ్యులు , శ్రీ ముగం ఆంజనేయులు , , శ్రీ మతి తూమురాజ్యలక్ష్మి , శ్రీ మతి ఉస్తేల కోటేశ్వరమ్మ , పాల్గొన్నారని దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ ఆకుల కొండలరావు గారు. ఒక ప్రకటనలో తెలియజేసినారని తమ దినపత్రిక నందు వార్తగా ప్రచురించవలసినదిగా కోరుచున్నాము.

# 61 కేజీలగంజాయిస్వాధీనం ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

**నార్త్ జోన్ డిఎస్పి కుమారి సిహెచ్ జీవన**

**కోరుకొండ ఆగస్టు 28 (మీ వార్త ప్రతినిధి)** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుపూడి సమీపంలో ఉన్న హిందుస్థాన్ పెట్రోల్ బంక్ సమీపంలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా డిఎల్ఎస్ సిబియు4445 నెంబర్ గల కారును పోలీసులు హాఫ్ ఎందుకు ప్రయత్నించగా కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను గమనించి వాహనాన్ని వెనక్కి తిప్పి తప్పించుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అదుపులోనికి తీసుకుని వాహనాన్ని తనిఖీ చేసామని దానిలో మూడు బస్తాలతో 61 కిలోల గంజాయిని, కారును మూడు సెల్ఫోన్లను ముగ్గురు వ్యక్తులను స్వాదీన పరుచుకుందామని నార్త్ జోన్ డిఎస్పి కుమారిసిహెచ్ జీవన వెల్లడించారు. శుక్రవారం కోరుకొండ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నార్త్ జోన్ డిఎస్పి కుమారి సిహెచ్ జీవన అందించిన విశ్వాసనీయ సమాచారంతో కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్





ఎస్ వి వి ఎస్ మూర్తి పర్యవేక్షణలో కోరుకొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సిహెచ్ వి రమేష్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారని, దానిలో ఈ గంజాయి తరలింపును కనుగొన్నామన్నారు. గంజాయి తరలించేవారు సదకత్ వయసు 49, సదాబ్ వయసు 29, సల్మాన్ వయసు 31 వీరంతా ముస్లిం కులానికి చెందిన వారని అన్నారు. ప్రాథమిక విచారణలో నిందితులు గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి ఇతరప్రాంతాలకుతరలించేందుకు ప్రయత్నించినట్లు వెల్లడించినట్లు తెలిపారు. కేసును సమర్థవంతంగా ఛేదించి గంజయ్య అక్రమ రవాణా అడ్డుకున్న కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్వీవీఎస్ మూర్తిని,సూర్య మోహన్ ఈగల్ టీం సర్కిల్ ఇన్స్పెక్టర్,కోరుకొండ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సిహెచ్ వి రమేష్ ని, కానిస్టేబుల్ లో బి రవికిరణ్, కేఎస్ ప్రకాశ్ రెడ్డి,ఏ రామచంద్రరావు, యం సుబ్రహ్మణ్యం, లను నార్త్ జోన్ డిఎస్పి కుమారి సిహెచ్ జీవన అభినందించారు. అలాగే వారికి రివార్డులను అందించారు.

## కోరుకొండలో జక్కంపూడి రాజా గృహంలో ఘనంగా సౌభాగ్య లక్ష్మీదేవి వ్రతం

**రాఖీ పౌర్ణమికి మహిళలు ప్రత్యేక పూజలు**

**కోరుకొండ ఆగస్టు 28 (మీ వార్త ప్రతినిధి)** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండల ప్రధాన కేంద్రంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్వగృహం వద్ద సౌభాగ్య లక్ష్మీదేవి వ్రతం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం, రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సౌభాగ్య లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా సౌభాగ్య లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి, గాజులు, చీరలు, రాఖీలను సమర్పించివేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాన్నినిర్వహించారు. జక్కంపూడి రాజా, రాజశ్రీ దంపతుల చేతుల మీదుగా సౌభాగ్య లక్ష్మీదేవి వ్రతం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.నియోజకవర్గం నలుమూలల నుంచి వందలాది మంది మహిళలు తరలివచ్చి సౌభాగ్య లక్ష్మీదేవి వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగామహిళలందరికీ జక్కంపూడి రాజా శుభాకాంక్షలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి,నియోజకవర్గంలోని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.





## మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**హైదరాబాద్** మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మంత్రి పొన్నం ప్రభాకర్ కి, వారి కుటుంబ సభ్యులకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి సీతక్క రాఖీ కట్టి మంత్రి పొన్నం ప్రభాకర్ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళా కమిషన్ చైర్మన్, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మేకలు, గొర్రెల అభివృద్ధి సహకార చైర్మన్ సరిత తిరుపతయ్య యాదవ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ కి రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రాఖీలు కట్టిన సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాఖీ పౌర్ణమి పండుగ కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

## సెప్టోలెసెంట్ అంటే ఎవరు?

**డాక్టర్. డి.సి.తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్**

**కరీంనగర్ :** డాక్టర్. డి.సి.తిరుపతిరావు మాట్లాడుతూ సెప్టోలెసెంట్ అంటే 70 సంవత్సరాలు దాటిన పురుషుడు లేదా మహిళ, కానీ సంప్రదాయ పద్ధతిలో వృద్ధాప్యాన్ని అంగీకరించకుండా, జీవితం పట్ల ఉత్సాహంతో, ప్రత్యేకమైన జీవనశైలిని ఎంచుకునే వ్యక్తి.

వారి లక్షణాలు ఇవి: వారు ఎప్పుడూ చురుకుగా ఉంటారు. ఉద్యోగం చేయవచ్చు, చదువుకోవచ్చు, లేదా తమను ఆలోచింపజేసే, ఉపయోగకరంగా అనిపించే ఏదైనా కొత్త కార్యక్రమాన్ని సృష్టించుకోవచ్చు.వారికి కనీసం ముగ్గురు మంచి స్నేహితులు ఉంటారు. వారితో కాఫీ, నీరు లేదా వైన్ తాగుతూ తరచూ కలుసుకుంటారు.వారు విలాసాలకు దూరంగా ప్రయాణిస్తూ కొత్త ప్రదేశాలు, సంస్కృతులను అనుభవిస్తారు. అయితే జీవితంలోని మంచి విషయాలను ఆస్వాదించడం మాత్రం మానరు. జీవిత భాగస్వామి, పిల్లలు, మనవలు-మనవరాళ్లు మరియు బంధువులతో ప్రేమ, గౌరవం, పరస్పర సహకారంతో కూడిన సంబంధాలను కొనసాగిస్తారు.వారు ఆశావాదులు, ఉత్సాహవంతులు. ఎప్పుడూ ఒక కొత్త ప్రాజెక్ట్ లేదా లక్ష్యాన్ని మనసులో ఉంచుకొని జీవితంలో నిలిచిపోకుండా ముందుకు సాగుతారు.ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటారు. అనారోగ్యాలను జీవితంలో భాగంగా స్వీకరిస్తారు. రోజుకు కనీసం 20 నిమిషాలు నడుస్తారు మరియు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటారు.చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని వెతుక్కుంటారు. అది పుట్టినరోజు కావచ్చు, ఒక వేడుక కావచ్చు, ఇష్టమైన సీరీస్ కావచ్చు లేదా కొత్త రోజు కావచ్చు. ప్రతి రోజుకు దేవునికి కృతజ్ఞతలు తెలుపుతారు.రోజంతా తమకు లభించే మంచి విషయాల పట్ల కృతజ్ఞతతో ఉంటారు. ఇతరులకు మేలు చేయడానికి ప్రయత్నిస్తారు.ప్రతిరోజూ చిరునవ్వుతో ఉంటారు. ఎందుకంటే ఇతరులు గమనించని, మెచ్చుకోని ఎన్నో అందమైన విషయాలను వారు ఆస్వాదిస్తారు.తమ వద్ద లేని వాటి గురించి బాధపడకుండా, ఉన్న వాటితో సంతోషంగా జీవిస్తారు. అందుకే వారు తమను తాము కోటీశ్వరుల్లా భావిస్తారు.నేను మిమ్మల్ని కూడా ఒక సెప్టోలెసెంట్‌గా మారమని ఆహ్వానిస్తున్నాను.ఈ రోజుల్లో వృద్ధాప్యాన్ని ఆపడం అసాధ్యం. కానీ వృద్ధాప్యాన్ని హుందాగా, గౌరవప్రదంగా స్వీకరించడం మాత్రం పూర్తిగా మన చేతుల్లోనే ఉంది అని డాక్టర్. డి.సి.తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ అన్నారు

## రాఖీ కట్టిన కార్మిక మహిళలు.. కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్ రెడ్డి

**గోదావరిఖని :** రాఖీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం నాడు ఓల్డ్ అశోక్ మేస్త్రి అడ్డా టాపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్మిక మహిళలు హరీష్ రెడ్డి గారికి రాఖీలు కట్టి ఆశీర్వదించారు.హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక భద్రత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని, రానున్న రోజుల్లో కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసేందుకు మహిళలు, కార్మికులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టాపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దిగువ యాదగిరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జహీద్ పాషా, బక్కి కిషన్, కృష్ణస్వామి, చొప్పరి శ్రీనివాస్, నిమ్మరాజుల సాగర్, మేకల రామస్వామి, రంగు దుర్గాప్రసాద్, బోట్ల పోషం, రౌతు గణేష్, రిషి, మామిడాల రాము, బోడకుంట వెంకటలక్ష్మి, కడార్ల శ్రీధర్, బండి రాజు, దిడ్డి కుమార్, కొండ సురేష్, నిజం, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన పరుగుల రాణి.

**కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న నల్లవెల్లి ఆనంది బంగారు పతకం సాధించారు. హనుమకొండ జేఎన్ఎం స్టేడియంలో 12 తెలంగాణ స్టేట్ మీట్ సౌత్ జోన్ అథెనెటిక్ ఛాంపియన్షిప్ 18 ఇయర్స్ విభాగంలో 400 మరియు 200 మీటర్స్ రాష్ట్రస్థాయి గోల్డ్ మెడల్ సాధించి సెప్టెంబర్ నెల పాండిచేరిలో జరిగే సౌత్ జోన్ నేషనల్ మీట్ కు నల్లవెల్లి ఆనంది ఎంపికైంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి కోచ్ సుబ్బారావుఆనందిని అభినందించినారు. ఏఎంసీ చైర్మన్ వైనాల రాజులైన్స్ క్లబ్ చైర్మన్ సాన రామకృష్ణారెడ్డి, లైన్స్ క్లబ్ సభ్యుడు లయన్ జబ్బార్ ఖాన్, బండ సాయి శంకర్ లు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అనుబంధాల బంధం... రాఖీ ఘనంగా రాఖీ వేడుకలు.

**కమాన్ పూర్ :** అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ కమాన్ పూర్ మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంతో పాటు గుండారం జూలపల్లి పేరా పల్లి రొంపి కుంట నాగారం పెంచికలపేట సిద్దిపల్లె తదితర గ్రామాల్లో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. దూరప్రాంతాల నుండి వచ్చి ఆయా గ్రామాల్లోని తమ సోదరులకు రాఖీలు కట్టారు. దీంతో సోదరులు తమ చెల్లెలకు అక్కలకు దక్షిణ సమర్పించారు. దీంతోపాటు గ్రామాల్లో రాఖీ పండుగ సందడి నెలకొంది. అలాగే తమ తమ బంధువుల సోదరుల గ్రామానికి వెళ్లేందుకు బస్సులు కిటకిటలాడాయి. ఈ వేడుకల్లో తహసిల్దార్ ముస్త్యాల వాసంతి, ఎంపీడి ఓ ప్రియాంక, ఎంపీ ఓ సౌమ్య, గిదవార్ స్రవంతి, సర్పంచులు పల్లె మాధవి నారాయణ, బంగారు కళ్యాణి మహేష్, పోల్ దాసరి వనిత సాయికుమార్, తదితరులు తమ సోదరులకు రాఖీలు కట్టారు.

## రోప్ స్కిప్పింగ్‌లో పారమిత విద్యార్థుల సత్తా

**కరీంనగర్ :** హైదరాబాద్ అల్మాస్‌గూడలో ఈ నెల 23న తెలంగాణ రోప్ స్కిప్పింగ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్‌లో పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-10 విభాగంలో 3వ తరగతి విద్యార్థి సి.హెచ్. ఈశ్వర సాయి, అండర్-8